

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 23-01-2026 | సంపుటి - 26 | సంచిక -244 | రూ : 4 | పేజీలు: 8


### దావోస్ వేదికగా ఆసక్తికర భేటీ..

## రేవంత్ రెడ్డిని కలిసిన నారా లోకేశ్

- పరస్పర సహకారంతో అభివృద్ధిపై ఇరు నేతల చర్చ
- ఏపీ విద్యా సంస్కరణలు, ఐటీ ప్రగతిని వివరించిన నారా లోకేశ్
- తెలంగాణ స్కిల్ క్యాంపస్‌లను చూడాలని లోకేష్‌కు రేవంత్ ఆహ్వానం
- మేడారం జాతరకు రావాలని లోకేష్‌ను ఆహ్వానించిన సీఎం



2లో



### గ్రూప్-1 ఫలితాల రద్దుపై సస్పెన్స్..

## తీర్పును వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు

- గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష ఫలితాల రద్దుపై తీర్పు వాయిదా
- ఫిబ్రవరి 5న తీర్పును వెల్లడించనున్న తెలంగాణ హైకోర్టు
- సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేసిన టీజీపీఎస్సీ, అభ్యర్థులు
- గతంలో నియామకాలకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చిన ధర్మాసనం
- తీర్పు వాయిదాతో అభ్యర్థుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

2లో



### మేడారం జాతరకు

## హెలికాప్టర్ సేవలు..


- తెలంగాణ టూరిజం, తుంబి ఎయిర్‌లైన్స్ సంయుక్త నిర్వహణ
- హనుమకొండ నుంచి మేడారానికి, జాతరపై ఏరియల్ వ్యూ రైడ్స్
- రెండు రకాల సర్వీసులకు వేర్వేరు ధరలు ఖరారు

2లో

## లోయలో పడిన ఆర్మీ వాహనం..

## 10 మంది సైనికులు మృతి

- జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం
- 200 అడుగుల లోతులోకి పడిపోయిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం
- గాయపడిన సైనికులు మిలిటరీ ఆసుపత్రికి తరలింపు



2లో



2లో

### కర్ణాటక అసెంబ్లీలో రగడ..

## గవర్నర్ పై ప్రభుత్వం ఆగ్రహం

- ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగం పూర్తిగా చదవకుండానే వెళ్లిపోయిన గవర్నర్
- గవర్నర్ ను అడ్డుకుంటూ నిలదీసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- సరైన నిర్ణయం తీసుకున్నారంటూ గవర్నర్ కు బీజేపీ ఎమ్మెల్యేల మద్దతు



2లో

### తెలంగాణ ప్రగతిలో

## భాగస్వాములమవుతాం

- ముఖ్యమంత్రితో ప్రపంచ ఆర్థిక వేదిక ప్రతినిధులు
- తెలంగాణ రైజింగ్-2047 విజన్‌కు మద్దతు
- ముగిసిన రాష్ట్ర బృందం దావోస్ పర్యటన

### 2035 నాటికి ఏపీ 'డే-జీరో రెడీ స్టేట్' గా

## గుర్తింపే లక్ష్యం: దావోస్‌లో మంత్రి లోకేశ్



- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ముందుకెళుతున్న ఏపీ
- 2035 నాటికి 'డే-జీరో రెడీ స్టేట్'గా మారడమే లక్ష్యం
- గత 18 నెలల్లో 50కి పైగా సంస్కరణలు అమలు చేసినట్లు వెల్లడి
- ప్రతి జిల్లాలో ఎంఎస్ఎంఈ ఆధారిత వృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- దావోస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడిన మంత్రి లోకేశ్

2లో

# 2035 నాటికి ఏపీ 'డే-జీరో రెడీ స్టేట్'గా గుర్తింపే లక్ష్యం: దావోస్‌లో మంత్రి నారా లోకేశ్

అమరావతి: ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ పారిశ్రామిక విధానంలో సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించింది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వైపు అడుగులు వేస్తున్నామని, పెట్టుబడులను వారాల వ్యవధిలోనే కార్యరూపంలోకి తెచ్చేలా 2035 నాటికి రాష్ట్రాన్ని 'డేజీరో రెడీ స్టేట్'గా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నమ్మకం, వేగం అనే రెండు అంశాలు ఏపీని కీలక పెట్టుబడుల గమ్యస్థానంగా మారుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దావోస్‌లో జరిగిన 'ద ఫాస్ట్ లేన్: ఇన్వెస్టింగ్ ఎట్ ది స్పీడ్ ఆఫ్ గ్రోత్' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి సమయం ఆదా చేయడమే అతిపెద్ద లాభం. ఇదే రాష్ట్రానికి ఆర్థిక పోటీలో ఆధిక్యతను ఇస్తోంది. దీనికోసం రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి (SIPB) ప్రతినెలా సమావేశమై ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించడంతో పాటు, అంతర్గత సమస్యలను పరిష్కరిస్తోంది. భూమి, యుటిలిటీస్, పర్యావరణ అనుమతుల వంటి అంశాల్లో వరుస అనుమతులకు బదులుగా ప్యారలల్ ప్రాసెసింగ్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ప్రాజెక్టులు ప్రారంభించే సమయాన్ని గణనీయంగా తగ్గించాం" అని వివరించారు.

**'డే-జీరో రెడీ స్టేట్' అంటే...!**

2035 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 'డేజీరో రెడీ స్టేట్'గా గుర్తింపు పొందేలా చేయడమే తమ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. అంటే, పెట్టుబడి నిర్ణయం తీసుకున్న కొన్ని వారాల్లోనే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా వ్యవస్థను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో నిర్ణయాలు వ్యక్తుల ఇష్టానుసారం కాకుండా, పటిష్టమైన వ్యవస్థ ఆధారంగా జరుగుతాయని హామీ ఇచ్చారు. రియల్ టైం డేటాతో పనిచేసే యూనిఫైడ్ డిజిటల్ గవర్నెన్స్ ద్వారా జాప్యాన్ని ముందుగానే గుర్తించి, అవరోధాలను తొలగిస్తున్నామని వివరించారు.

**నిబంధనల సరళీకరణ**

పరిపాలనలో వేగాన్ని పెంచేందుకు డీ రెగ్యులేషన్ డ్రైవ్‌లో భాగంగా గత 18 నెలల్లో 50కి పైగా సంస్కరణలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా నాలా చట్టాన్ని రద్దు చేశామని, డీక్రిమినలైజేషన్ దిశగా మరిన్ని చర్యలు తీసుకోనున్నామని వెల్లడించారు. తాము రిస్క్ బేస్డ్ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌ను అనుసరిస్తున్నామని, తక్కువ రిస్క్ ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇస్తూ, అధిక ప్రభావం చూపే ప్రాజెక్టుల విషయంలో లోతైన పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఇది సుస్థిర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

**ఎంఎస్ఎంఈ ఆధారిత వృద్ధి**

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని కొన్ని నగరాలకే పరిమితం చేయకుండా, అన్ని ప్రాంతాలకు విస్తరింపజేస్తున్నామని లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగా 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ప్రతి జిల్లాలో ఎంఎస్ఎంఈ ఆధారిత వృద్ధి ద్వారా ఉద్యోగాలు, ఆదాయం, సంపద సమానంగా పంపిణీ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి పార్కును స్థానిక వనరుల ఆధారంగా, అగ్రో ప్రాసెసింగ్, సముద్ర ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల కోసం ప్రత్యేక క్లస్టర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఇది వలసలను తగ్గించడంతో పాటు, పెద్ద పరిశ్రమలకు సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు, నాణ్యమైన మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడమే ఏపీ ప్రత్యేకత అని లోకేశ్ అన్నారు. విధానాల స్థిరత్వం, సంస్థల విశ్వసనీయతతో పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తున్నామన్నారు. నమ్మకం, వేగం రెండూ కలిసి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పోటీ వాతావరణంలో ఒక ప్రత్యేక పెట్టుబడి గమ్యస్థానంగా నిలబెడుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కెర్నీ సీనియర్ పార్టనర్ సుకేతు గాంధీ, గూగుల్ ఏసియా పసిఫిక్ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా, కాగ్నిజెంట్ గ్లోబల్ సీఎఫ్ఓ జతిన్ దలాల్, రెన్యూ ఛైర్మన్ సుమంత్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

## దావోస్ వేదికగా ఆసక్తికర భేటీ...
# రేవంత్ రెడ్డిని కలిసిన నారా లోకేశ్

దావోస్ : స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా తెలుగు రాష్ట్రాల నేతల మధ్య స్నేహపూర్వక భేటీ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల అభివృద్ధి, ప్రగతి ప్రణాళికలపై ఇరువురు నేతలు ఫలవంతమైన చర్చలు జరిపారు. పరస్పర సహకారంతోనే తెలుగు రాష్ట్రాల సమగ్రాభివృద్ధి సాధ్యమని ఇద్దరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో భాగంగా మంత్రి నారా లోకేశ్... సీఎం రేవంత్ రెడ్డిని మంగళగిరి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ప్రతిగా సీఎం రేవంత్ రెడ్డి కూడా లోకేశ్ ను సత్కరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న విద్యా సంస్కరణలు, ఐటీ రంగంలో సాధిస్తున్న ప్రగతిని లోకేశ్ ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' కోసం తీసుకుంటున్న చర్యలు, వాటి ద్వారా వస్తున్న సానుకూల ఫలితాల గురించి చర్చించారు. దీనిపై స్పందించిన రేవంత్ రెడ్డి, తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి తెలిపారు. ముఖ్యంగా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా టాటా సంస్థ సహకారంతో తెలంగాణలోని ఐటీఐలను ఆధునిక స్కిల్ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దామని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ క్యాంపస్‌లను సందర్శించి, అక్కడ అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించాలని లోకేశ్ ను ఆయన ఆహ్వానించారు. అలాగే, కోట్లాది మంది భక్తులు దర్శించుకునే మేడారం సమ్మక్క సారలమ్మ దేవస్థానాన్ని వందల కోట్ల రూపాయలతో ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం చూపని చొరవతో రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, తప్పకుండా వనదేవతలను దర్శించుకోవాలని లోకేష్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. పెట్టుబడుల సాధనలో తెలుగు రాష్ట్రాలు పరస్పరం పోటీపడుతూనే, అభివృద్ధి విషయంలో సహకరించుకోవాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తితో ముందుకెళితే దేశానికే తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గ్రూప్-1 ఫలితాల రద్దుపై సస్పెన్స్...
# తీర్పును వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్: తెలంగాణ గ్రూప్1 సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై హైకోర్టు తన తీర్పును వాయిదా వేసింది. ఈ కేసులో తుది తీర్పును ఫిబ్రవరి 5వ తేదీన వెల్లడించనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ప్రకటించింది. తీర్పు కాపీ ఇంకా సిద్ధం కాలేదని, అందువల్ల వాయిదా వేస్తున్నట్లు కోర్టు పార్టీలకు తెలియజేసింది. ఈ అప్పీళ్లపై గత డిసెంబర్ 31న వాదనలు ముగించిన ధర్మాసనం, తీర్పును రిజర్వ్ చేసింది. గ్రూప్1 మెయిన్స్ మూల్యాంకన ప్రక్రియలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని పేర్కొంటూ, సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ నమవరపు రాజేశ్వర్ రావు సెప్టెంబర్ 9న ఫలితాలు, ర్యాంకుల జాబితాను రద్దు చేశారు. జవాబు పత్రాలను మ్యాన్యువల్‌గా పునఃమూల్యాంకనం చేయాలని లేదా 8 నెలల్లోగా పరీక్షను తిరిగి నిర్వహించాలని టీజీపీఎస్సీని ఆదేశించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పును తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC), ఎంపికైన కొందరు అభ్యర్థులు డివిజన్ బెంచ్‌లో సవాలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం, సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించింది. ఫలితాల ఆధారంగా నియామక ప్రక్రియను కొనసాగించడానికి టీజీపీఎస్సీకి అనుమతి ఇచ్చింది. అయితే, ఈ నియామకాలు కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని అప్పట్లో స్పష్టం చేసింది. ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో, టీజీపీఎస్సీ 563 పోస్టులకు గాను 562 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన ఈ మెయిన్స్ పరీక్షలకు దాదాపు 30,000 మంది హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రూప్1 మెయిన్స్ పరీక్షలు జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

## లోయలో పడిన ఆర్మీ వాహనం..
# 10 మంది సైనికులు మృతి

జమ్మూకశ్మీర్: జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇండియన్ ఆర్మీకి చెందిన వాహనం లోయలో పడిపోయింది. చంబాబందేర్వా హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 10 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా... పలువురు గాయపడ్డారు. ఆర్మీకి చెందిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో 17 మంది ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో ప్రమాదం సంభవించింది. లోయలో సుమారు 200 అడుగుల లోతులోకి వాహనం పడిపోయింది. హై ఆల్టిట్యూడ్ పోస్టు వద్దకు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఆర్మీతో పాటు పోలీసులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడినవారిని ఉదంపూర్ మిలిటరీ ఆసుపత్రికి తరలించారు.

# తెలంగాణ ప్రగతిలో భాగస్వాములమవుతాం

హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో తాము భాగస్వాములమవుతామంటూ ప్రపంచ ఆర్థిక వేదిక ప్రతినిధులు హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలిచ్చారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో గురువారం నిర్వహించిన తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో... ఆ వేదిక మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్, సీ4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్' లక్ష్యాలతోపాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలో అప్ సదస్సు నిర్వహించే ప్రతిపాదనలపై చర్చించారు. దావోస్ సదస్సులో జరిగే చర్చలు, తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ప్రతి ఏడాది జులైలో హైదరాబాద్‌లో ఫాలో అప్ సమావేశం నిర్వహిస్తే ఉపయోగపడుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌లో ప్రతిభావంతమైన మానవ వనరులున్నాయన్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు, క్రీడలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. సమీప భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' జరుగుతోందని, సౌదీ అరేబియా కూడా ఆసక్తి ప్రదర్శిస్తోందని వెల్లడించారు. ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్‌ను సీఎం వివరించారు. తెలంగాణ విజన్‌లోని విభిన్న కోణాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఏషియా 2024లో ప్రారంభించిన సీ4ఐఆర్ (సెంటర్ ఫర్ ది ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్) పురోగతిపై ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ భారత్‌లో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ ఇదేనని గుర్తుచేశారు. పరిశ్రమల అభివృద్ధి ప్రణాళికలో ఉత్తమ పద్ధతులపై సీ4ఐఆర్ చేస్తున్న పరిశోధనల సమాచారాన్ని తెలంగాణ ప్రభుత్వంతో పంచుకుంటామని జెరెమీ జర్గెన్స్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్యూర్, ప్యూర్, రేర్ ఆర్థిక అభివృద్ధి వ్యూహంతోపాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటును వివరించారు. ఇది నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా.. దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ఏరోస్పేస్, డిఫెన్స్, బయోడిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతలను వివరించారు.

# మేడారం జాతరకు హెలికాప్టర్ సేవలు

మేడారం: తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతరకు వెళ్లే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జాతర సమయంలో వేగంగా గమ్యస్థానం చేరుకునేందుకు వీలుగా హెలికాప్టర్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. తెలంగాణ పర్యాటక శాఖ, తుంబి ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా అందిస్తున్న ఈ సేవలు ఇవాళ్టి నుంచి ప్రారంభమయ్యాయి. భక్తుల అవసరాలకు అనుగుణంగా రెండు రకాల ప్యాకేజీలను నిర్వాహకులు ప్రకటించారు. మొదటి ప్యాకేజీలో భాగంగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం నుంచి నేరుగా మేడారం వెళ్లి, తిరిగి వచ్చేందుకు అవకాశం కల్పించారు. ఈ రౌండ్ ట్రిప్‌కు ఒక్కో వ్యక్తికి ఛార్జీ రూ. 35,999గా నిర్ణయించారు. అయితే, జనవరి 23లోపు బుక్ చేసుకున్న వారికి రాయితీ అందిస్తుండగా, వారు రూ. 30,999 చెల్లిస్తే సరిపోతుంది. ఇక, రెండో ప్యాకేజీ కింద మేడారం జాతర అందాలను ఆకాశం నుంచి వీక్షించాలనుకునే వారి కోసం 'జాయ్ రైడ్స్' నిర్వహిస్తున్నారు. మేడారం సమీపంలోని పడిగాపూర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి ఈ సర్వీసులు నడుస్తాయి. సుమారు 6 నుంచి 7 నిమిషాల పాటు సాగే ఈ గగన విహారానికి ఒక్కొక్కరికి రూ. 4,800 రుసుముగా వసూలు చేయనున్నారు. ఈ సేవలతో భక్తులు సమయం ఆదా చేసుకోవడంతో పాటు జాతరను విహంగ వీక్షణం చేసే అద్భుత అవకాశం పొందవచ్చు.

# కర్ణాటక అసెంబ్లీలో రగడ.. గవర్నర్ పై ప్రభుత్వం ఆగ్రహం

కర్ణాటక: కర్ణాటక అసెంబ్లీలో వివాదం చెలరేగింది. అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ తన ప్రసంగాన్ని రెండు మాటలతోనే ముగించి సభలో నుంచి వెళ్లిపోయారు. ఉపాధి హామీ పథకంపై కేంద్రానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని గెహ్లాట్ చదవలేదు. దీంతో గవర్నర్ గెహ్లాట్ తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మండిపడుతుండగా.. బీజేపీ ఎమ్మెల్యేలు గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ సమర్థిస్తున్నారు.

**అసలు ఏం జరిగిందంటే..**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ప్రసంగించాల్సి ఉంది. సాధారణంగా ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగం కాపీని గవర్నర్ సభలో చదువుతారు. ఈ సంప్రదాయం మేరకు సిద్ధరామయ్య ప్రభుత్వం గవర్నర్ కు ప్రసంగం కాపీ అందించింది. అయితే, అందులో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి చేసిన మార్పులను వ్యతిరేకించింది. కేంద్రం తీరుకు నిరసనగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని ఈ ప్రసంగం కాపీలో ప్రస్తావించింది.

దీనిని చదివేందుకు నిరాకరించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్.. సింపుల్ గా 'రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ ప్రసంగాన్ని ముగించేశారు. ఆపై సభలో నుంచి వెళ్లిపోతుండగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని సీఎం సిద్ధరామయ్య కూడా గవర్నర్ పై మండిపడ్డారు. అయితే, కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని చదవకూడదని గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ బీజేపీ ఎమ్మెల్యేలు సమర్థించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అవమానించాలన్న కాంగ్రెస్ కుటిల ప్రయత్నాన్ని సరిగ్గా తిప్పికొట్టారంటూ గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర కొనియాడారు. గవర్నర్ పట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రవర్తనకు సీఎం సిద్ధరామయ్య క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.


# రేపు నారా లోకేశ్ పుట్టినరోజు... సీడీపీ విడుదల చేసిన తెలుగుదేశం పార్టీ

ఆంధ్రప్రదేశ్ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రేపు పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా పార్టీ ఆయన కామన్ డిస్‌ప్లే పిక్చర్ (సీడీపీ)ను విడుదల చేసింది. జనవరి 23న లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ శ్రేణులు, ఆయన అభిమానులు సోషల్ మీడియాలో ఈ సీడీపీని విస్తృతంగా షేర్ చేస్తున్నారు. ప్రస్తుతం లోకేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా కూడా ఆయన క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా రేపు రాష్ట్రవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు, వేడుకలు నిర్వహించేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సీడీపీ విడుదలతో ఒకరోజు ముందుగానే సోషల్ మీడియాలో పుట్టినరోజు సందడి మొదలైంది. "యువ, డైనమిక్ నాయకుడు నారా లోకేశ్ పుట్టినరోజు సీడీపీని పంచుకోవడం సంతోషంగా ఉంది" అని తెలుగుదేశం పార్టీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పేర్కొంది.

## మస్క్ తొలగించినా డీలాపడలేదు..
# వేల కోట్ల కంపెనీకి అధిపతిగా పరాగ్!

'ఎక్స్' (ట్విట్టర్) మాజీ సీఈఓ పరాగ్ అగర్వాల్ పేరు చెప్పగానే, ఎలాన్ మస్క్ ఆయన్ను పదవి నుంచి తొలగించిన ఘటనే గుర్తుకొస్తుంది. కానీ, సరిగ్గా రెండేళ్ల తర్వాత పరాగ్ టెక్ ప్రపంచంలోకి ఘనంగా పునరాగమనం చేశారు. ఆయన స్థాపించిన 'పారలెల్ వెబ్ సిస్టమ్స్' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ ఇప్పుడు ఏకంగా రూ. 6,000 కోట్లకు పైగా విలువతో సంచలనం సృష్టిస్తోంది. 2022 అక్టోబరులో ఎలాన్ మస్క్ ట్విట్టర్‌ను స్వాధీనం చేసుకున్న వెంటనే పరాగ్‌ను సీఈఓ పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఫేక్ అకౌంట్ల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మస్క్ ఆయన్ను అవమానకరంగా ఆఫీసు నుంచి బయటకు పంపించడంతో అప్పట్లో ఇది పెద్ద చర్చనీయాంశమైంది. అప్పటి నుంచి దాదాపు రెండేళ్ల పాటు పరాగ్ అగర్వాల్ పెద్దగా వార్తల్లో కనిపించలేదు. అయితే, ఈ విరామంలో ఆయన తన పాత మిత్రులతో కలిసి ఒక కొత్త ఏఐ స్టార్టప్‌ను ప్రారంభించారు. డెవలపర్స్ కోసం అత్యాధునిక ఏఐ టూల్స్‌ను రూపొందించడమే లక్ష్యంగా ఈ సంస్థను నిర్మించారు. పరాగ్ ప్రతిభపై నమ్మకంతో ఖోస్లా వెంచర్స్ వంటి ప్రముఖ సంస్థలు సుమారు రూ. 250 కోట్ల ప్రారంభ పెట్టుబడిని అందించాయి. ముంబై ఐఐటీలో చదువుకున్న పరాగ్ అగర్వాల్, 2011లో సాధారణ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ట్విట్టర్‌లో చేరారు. తన ప్రతిభతో అంచెలంచెలుగా ఎదుగుతూ 2021లో కంపెనీకి సీఈఓ అయ్యారు. ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా, తన నైపుణ్యంతోనే తిరిగి సమాధానం చెప్పారు. మస్క్ ఆయనను ఉద్యోగం నుంచి తొలగించగలిగినా, ఆయనలోని ప్రతిభను మాత్రం ఆపలేకపోయారని ఈ విజయం నిరూపిస్తోంది.

## శ్రీ రామ్ నగర్ లో ఘనంగా శ్రీ మార్కండేయ జయంతి వేడుకలు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : శ్రీ మార్కండేయ జయంతి సందర్భంగా జగద్గిరిగుట్ట, రోడమేస్త్రినగర్ డివిజన్ ల పరిధి, శ్రీరామ్ నగర్ లో గల శివ మార్కండేయ స్వామి ఆలయంలో ఆలయ ఛైర్మెన్ గుదే రాజశేఖర్ పద్మశాలి ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరంవ ఆయన మాట్లాడుతూ స్వామి వారి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్వ శంకరయ్య, శ్రీరాములు,తెలంగాణ సాయి, అశోక్,బాలకృష్ణ,వెంకటేష్, శేషారెడ్డి,రాయి విగ్నేష్,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాగిత రహిత ఆన్లైన్ చెల్లింపుకు ప్రతి ఒక్కరు సహకరించాలి




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాగిత రహిత ఆన్లైన్ చెల్లింపుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సహాయ కోశాధికారి కృష్ణమోహన్ మరియన్, ఉప కోశాధికారి బి.శ్రీనివాస్ లు కోరారు. చౌటుప్పల్ డివిజనల్ సబ్ ట్రెజరీ కార్యాలయ పరిధిలోని డి.డి.ఓ.లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో భాగంగా చౌటుప్పల్ ట్రెజరీ కార్యాలయం ఈవోచర్స్, ఈసిగ్నేచర్ బిల్లుల రూపకల్పనపై అవగాహన కల్పించారు. ఐ.ఎఫ్.ఐ.ఎం.ఎస్. పోర్టల్ లో వాటిని ఎలా సబ్మిట్ చేయాలో కూడా వివరించారు. ఈ సందర్భంగా సహాయ కోశాధికారి కృష్ణమోహన్ మరియన్, ఉప కోశాధికారి, బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటినుంచి ఆన్లైన్ చెల్లింపులకు సహకరించాలని కోరారు. కాగిత రహిత చెల్లింపును అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంటెంట్ మల్లికార్జున్, డీ.డీ.వో లు ధనలక్ష్మి, అక్షయ్, జూనియర్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## జనగణన జీవో జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం



తెలంగాణ ప్రభుత్వం జనగణన-2027కు సంబంధించి జీవో జారీ చేసింది. ఈ జనగణన దేశవ్యాప్తంగా రెండు దశల్లో జరుగుతుంది. మొదటి దశలో 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఇళ్ల వివరాలు, భవనాలు, నిర్మాణాలపై సమాచారం సేకరిస్తారు. రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా లెక్కలు మొదలుపెట్టి, మార్చ్ 1 అర్ధరాత్రి వరకు పూర్తి కానుంది. ఈసారి జనగణనతోపాటు కుల గణనను కూడా చేయనున్నారు. మొత్తం ప్రక్రియ డిజిటల్ పద్ధతిలో జరుగుతుంది. ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో భాగంగా గ్రామాలు, మండలాలు, జిల్లాల సరిహద్దులను అప్డేట్ చేయడం, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం, శిక్షణ వంటి సన్నాహాలు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే జనగణన పూర్తయ్యే వరకు జిల్లాలు, నియోజకవర్గాల సరిహద్దుల్లో మార్పులు చేయరాదని స్పష్టం చేశారు. ఈ జనగణన తర్వాత లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశం ఉండటంతో ఈ ప్రక్రియకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

## పీవీ సింధును అభినందించిన తెలుగు రాష్ట్రాల సీఎంలు



భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఇండోనేసియా మాస్టర్స్ టోర్నమెంట్‌లో రెండో రౌండ్‌లో గెలిచి తన కెరీర్‌లో 500వ విజయాన్ని నమోదు చేసి చరిత్ర సృష్టించింది. మహిళల సింగిల్స్‌లో 500 విజయాలు సాధించిన తొలి భారతీయ షట్లర్‌గా సింధు రికార్డు సాధించడం దేశానికి గర్వకారణంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘనతపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి పీవీ సింధుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తెలుగు బిడ్డ పీవీ సింధు 500వ విజయం సాధించడం నిజంగా గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. నీ కష్టం, కఠిన సాధన ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. ఆకాశమే నీకు హద్దు కాదని, భవిష్యత్తులో ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఆయన సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. పీవీ సింధు 500వ విజయం సాధించడం తెలంగాణకే కాదు, దేశానికే గర్వకారణమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. సింధు అంకితభావం, నిరంతర కష్టపాటు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.

# ఆదివాసీల సంక్షేమం,అభివృద్ధి కొరకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి

*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొమరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏద్దులగూడెం ఆదివాసీ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ చంద్రభాను,ఇల్లందు సీఐ సురేష్,టేకులపల్లి సీఐ సత్యనారాయణ,గుండాల సీఐ తిరుపతి,ఎస్సైలు రాజేందర్,రవూఫ్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ఆదివాసీల సంక్షేమం,అభివృద్ధి కోసం పోలీస్ శాఖ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.ఆదివాసీ ప్రజలకు కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత,పిల్లలు విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు.మత్తు పదార్థాల వినియోగం,రోడ్డు ప్రమాదాలు,సైబర్ క్రైమ్స్,పోక్సో కేసుల గురించి గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్పీ చేతుల మీదుగా అక్కడ నివసించే 100 కుటుంబాల వారికి హెల్మెట్లు,దుప్పట్లు పంపిణీ చేశారు. పిల్లలకు పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేశారు.అనంతరం గ్రామంలోని యువతకు ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంటును ఎస్పీ ప్రారంభించారు.ఈ సందర్భంగా కొమరారం పోలీస్ స్టేషన్ ను సందర్శించి అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అక్కడ విధులలో ఉండే అధికారులు,సిబ్బంది కొరకు నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ క్వార్టర్స్ పనులను పరిశీలించారు.

# ఇకపై ఆన్లైన్ ద్వారానే ఇసుక సరఫరా

*** భద్రాద్రి కొత్తగూడెంలో 'మన ఇసుక వాహనం' పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఇసుక సరఫరా వ్యవస్థను పారదర్శకంగా, నియంత్రితంగా అమలు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పైలట్ ప్రాజెక్టా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఇకపై ఇందిరమ్మ ఇండ్లు, గృహ నిర్మాణాలు, ప్రభుత్వ పనులు సహా అన్ని అవసరాలకు ఇసుక సరఫరా పూర్తిగా ఆన్లైన్ ద్వారానే జరుగుతుందని, మాన్యువల్ కూపన్లు రద్దు చేసినట్లు స్పష్టం చేశారు.ఈ విధానంతో ఇసుక అక్రమ రవాణా, నిల్వలు, అవినీతి సమస్యలకు చెక్ పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. బుకింగ్, రవాణా అనుమతులు, జీపీఎస్ ట్రాకింగ్, చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం అన్నీ ఆన్లైన్‌లోనే జరుగుతాయని తెలిపారు. మండలాల వారీగా డిమాండ్‌కు అనుగుణంగా రీచ్‌లను గుర్తించి, రోజువారీ సరఫరా వివరాలు ఏడి మైన్స్ కార్యాలయానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు.ఈ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలంటే అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. అవగాహన సదస్సులో ఏడీ మైనింగ్, టీజీఎండీసీ, సీజీజీ ప్రతినిధులు, తహసిల్దార్లు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

*** 'అరైవ్–అలైవ్' కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైతు బజార్ వద్ద పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'అరైవ్-అలైవ్' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ రెహమాన్ ఆధ్వర్యంలో నిర్వహించగా, పట్టణ ప్రజలు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. హెల్మెట్ ధరించడం ద్వారా ద్విచక్ర వాహనదారులు తమ ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు.ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ అహర్నిశలు పనిచేస్తోందని, రోడ్డు ప్రమాదాల నివారణకు 'అరైవ్-అలైవ్' వంటి కార్యక్రమాలు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ ప్రతాప్, త్రీ టౌన్ సీఐ శివప్రసాద్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్, ఎస్సై విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



## బాలలు బడికి ఆనందంగా వచ్చేలా చర్యలు

*** నూతన హంగులతో ప్రీ ప్రైమరీ విద్యాలయాలు సిద్ధం**

*** జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల: బాలలు బుడి బుడి అడుగులతో బడికి ఆనందంగా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. బాలల్లో పాఠ్యాంశాలపై ఆసక్తి కలిగేలా తీర్చిదిద్దునట్లు కలెక్టర్ చెప్పారు. పీఎంశ్రీలో భాగంగా సమగ్ర శిక్ష కింద జిల్లాలోని పలు విద్యాలయాల్లో ప్రీ ప్రైమరీ సెక్షన్లు మంజూరు అయ్యాయి. ఇందులో భాగంగా బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లిలో ప్రీ ప్రైమరీ విద్యాలయానికి నూతన హంగులతో సిద్ధం చేశారు. ప్రాథమిక విద్య అంశాలపై అవగాహన వచ్చేలా వివిధ రంగులతో చిత్రాలు, పెయింటింగులు, ఫర్నిచర్ ఆకట్టుకుంటున్నాయి. గురువారం ఈ విద్యాలయాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించారు. పిల్లల ఫ్రెండ్లీ చిత్రాలు, పెయింటింగ్ లు, ఫర్నిచర్ ఏర్పాటు చేయగా ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఎందరు విద్యార్థులు చదువుతున్నారు? ఏమి ఏమి నేర్పిస్తున్నారో ఆరా తీశారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని పదమూడు మండలాల్లో ప్రీ ప్రైమరీ తరగతులు కొనసాగు తున్నాయి. అనంతరం అదే ఆవరణలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సైన్స్ కు సంబంధించిన పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వార్షిక పరీక్షలకు ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని సూచించారు. ఈ స్కూల్ లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచేలా కృషి చేయాలని టీచర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ వినోద్ కుమార్, తహశీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీఓ శ్రీధర్, డీఈఓ కార్యాలయ అధికారి శైలజ, సర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి రూ.50వేల ఆర్థిక సహాయం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన గద్దల నరేష్ అనారోగ్యానికి గురై కెల్విన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనిది నిరుపేద కుటుంబం కావడంతో చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను కోరగా కొమ్మ బాలయ్య ద్వారా రూ.50 వేలను గురువారం అందజేశారు. ఆర్థిక సహాయం అందించిన వారికి ఈ సందర్భంగా నరేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాడ శ్రీనివాస్, ఈడుగురాళ్ల సంతోష్ గౌడ్, కొమ్ము కష్ణ తదితరులున్నారు.

## పంతంగి ఉపసర్పంచ్ బోయ సదానందంకు ఘన సన్మానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పంతంగి గ్రామ ఉప సర్పంచ్ గా బోయ సదానందంను ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ ఆధ్వర్యంలో చౌటుప్పల్ లో గురువారం ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బోయ లింగస్వామి మాదిగ మాట్లాడుతూ నూతనంగా ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన దళిత బిడ్డలు భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండేలా పాలన కొనసాగించాలని ఆకాంక్షించారు. సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎర్ర శంకర్, మండల ఉపాధ్యక్షుడు చీమకండ్ల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ తాళ్ళసింగారం గ్రామ శాఖ అధ్యక్షుడు దొనకొండ కిరణ్, వికలాంగుల సంఘం జిల్లా నాయకుడు గడ్డం ప్రభాకర్, దళిత సంఘం సీనియర్ నాయకుడు బోయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భారత గడ్డపై సిపిఐది తిరుగులేని ప్రస్థానం

*** ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : భారత గడ్డపై సిపిఐది తిరుగులేని ప్రస్థానం అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.చుంచుపల్లి మండలం గౌతంపూర్‌లో సిపిఐ శతవసంత పైలాన్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 1925లో దేశ స్వాతంత్ర్యానికి ముందే ఆవిర్భవించి, త్యాగాలు-పోరాటాలతో ప్రజలతో మమేకమై ముందుకు సాగుతోందన్నారు. పేదలు, కార్మికులు, రైతులు, బడుగు-బలహీన వర్గాల అభ్యున్నతే సిపిఐ లక్ష్యమని చెప్పారు. రానున్న వందేళ్లు కూడా ప్రజలతోనే పార్టీ ప్రయాణం కొనసాగుతుందన్నారు.ఖమ్మంలో నిర్వహించిన సిపిఐ శతవసంత సభ దేశ చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వారధిగా ఉండాలి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వారధిగా ఉంటూ స్ఫూర్తిదాయక కథనాలతో "ప్రజా స్ఫూర్తి" మరింత అభివృద్ధి చెందాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షులు, "ప్రజాస్ఫూర్తి" దినపత్రిక ఎడిటర్ గడ్డమీది బాల్ రాజ్ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన కాలమానిని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో స్ఫూర్తిదాయకంగా "ప్రజా స్ఫూర్తి" మరింత ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, రిపోర్టర్ గణేష్, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# 18 సంవత్సరములు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవాలి

*** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం సిబ్బంది**



మేడ్చల్ ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : 18 సంవత్సరములు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేయించడముతో పాటు ప్రతి ఎన్నికలలో విధిగా తమ ఓటును ఆయుధముగా వినియోగించి ఎన్నిక ప్రక్రియలో భాగస్వాములు అవ్వాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం సిబ్బంది అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు పనిచేయుచున్న సిబ్బంది అందరూ ఓటర్ల చైతన్య కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమములో పాల్గొన్నారు. ఓటర్లను చైతన్యవంతము చేసే కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాలో ప్రతి ఒక్క ఉద్యోగి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్యాలయ సిబ్బంది అందరూ చైతన్య కార్యక్రమాల గురించి , ఓటర్ నమోదు అంశాలు పై రంగోలి కార్యక్రమము నిర్వహించారు. మహిళలు ,పురుషులకు చెస్ , క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్ వంటి ఆటల పోటీలు నిర్వహించడం జరిగినది. సమాజంలో తెలియపరచడం జరిగింది ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి ఎం సాంబశివరావు. డిఎస్సిడిఓ వినోద్ కుమార్,డిబిసిడిఓ ఝాన్సీ రాణి, జిల్లా క్రీడలు యువజన శాఖ అధికారి , జిల్లా అధికారులు వారి సిబ్బంది పాల్గొన్నారు.

# మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసాని పాఠశాలను సందర్శించిన ఐటిడిఏ ఏసీఎంఓ కే.రమేష్

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసాని పాఠశాలను ఐటిడిఏ భద్రాచలం అకాడమిక్ మానిటరింగ్ సెల్ అధికారి (ఏసీఎంఓ) కే.రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడిన ఆయన, ఈ విద్యా సంవత్సరం 100 శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. జీవితంలో సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నప్పుడే లక్ష్యాలను సాధించగలమని ఆయన అన్నారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పదవ తరగతి అనంతరం అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు, అవకాశాలపై ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అందించిన కెరీర్ గైడెన్స్ ఫ్లెక్సను పరిశీలించి పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు ప్రతిరోజూ నిర్వహిస్తున్న స్లిప్ టెస్టుల వివరాలు, ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మార్గనిర్దేశనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులందరూ సమిష్టిబాధ్యతతో పనిచేసినప్పుడే 100 శాతం ఫలితాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, సబ్జెక్టు వారీగా బోధన విధానం, విద్యార్థుల ప్రగతి, లోపాల సవరణపై సమీక్ష నిర్వహించారు. ఉద్దీపకం వర్క్బుక్ విద్యార్థుల అభ్యాసానికి ఎంతో ఉపయుక్తమని, ప్రతి విద్యార్థికి అది పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎన్.చందు, స్టాఫ్ సెక్రటరీ ఎస్.బాలు, వార్డెన్ పోలేబోయిన వెంకటేశ్వర్లు, శంకర్, స్వరూప రాణి, పద్మావతమ్మ, ఇంగ్లీష్ బాలు, భగవాన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# యువశక్తి లేనిదే సమాజం లేదు...

*** కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు వెళ్లాలి..**
*** ప్రపంచ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్**
*** మర్వెల్లిలో వాలిబాల్ క్రీడా పోటీలకు హాజరైన జైస్వాల్**

అందోలు,ప్రజాస్ఫూర్తి: యువశక్తి లేనిదే సమాజం లేదని ప్రపంచ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ అన్నారు. గురువారం మర్వెల్లి గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న వాలిబాల్ ఓపెన్‌టూఆల్ క్రీడాపోటీల వేడుకలకు ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటగా వాలిబాల్ క్రీడాకారులతో పరిచయం చేసుకొని క్రీడల్లో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరూ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు . ఈ సందర్భంగా శివపార్వతుల కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని స్థానిక పాఠశాల విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రతి ఆడబిడ్డ ఆ ఇంటకి భారంగా కాకుండా వరంగా భావించాలన్నారు. గ్రామంలోని ప్రతి ఆడబిడ్డ నైనా జైస్వాల్‌గా మారాలని కోరుకుంటున్నట్లు ఆమె తెలిపారు . ఆరోగ్యం , ఐశ్వర్యం,వైభవం, సౌభాగ్యం వంటివి ఆస్తి అంతస్తులు , ఉన్నదానిపై నిర్లక్ష్యం చూపుతూ లేనిదానికోసం ఆరాటపడకూడదన్నారు. ఎల్లప్పుడు సంతోషంగా ఉండాలన్నారు. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని, బాధలను ఓపికగా ఓర్చుకున్నప్పుడే సంతోషాలు మిమ్మల్ని వెతుకుంటూ వస్తాయన్నారు. సెల్‌ఫోన్ జీవితంలో ఒక భాగం మాత్రమేనని జీవితం కాకూడదన్నారు. నేటి సమాజంలో సెల్‌ఫోన్ పిచ్చి గజ్జీగా మారిందన్నారు. చెడు వ్యక్తులకు దూరంగా ఉండి ఒక విలువైన మిత్రుడికి దగ్గరగాఉంటే చాలని , బాధను ఇచ్చే బంధాలను కాకుండా బలం ఇచ్చే బంధాలను కోరుకోవాలన్నారు.




**క్రీడలకు ప్రాధాన్యత...**

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తోందని నిజమాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. క్రీడా పోటీలకు హాజరై ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు మానసిక ప్రశాంతత కలిగిస్తుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్ పోటీలను మండల ,జిల్లా స్థాయిలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత మదక ద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలతో పాటు చదవుపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సంగమేశ్వర్, జైస్వాల్ సోదరుడు అగస్త్య జైస్వాల్, డిఎస్పీ సత్తయ్యగౌడ్, జోగిపేట సీఐ అనిల్‌కుమార్, రాష్ట్ర వీరశైవ లింగబలిజ సంఘం రాష్ట్ర యువజన నాయకులు శివచరణ్,సంగమేశ్వర్, జోగిపేట ఏయంసీ చైర్మెన్ జగన్మోహన్‌రెడ్డి , ఆత్మ కమిటీ చైర్మెన్ కచూర్‌రావు, సర్పంచ్‌లు విశ్వాస్, లింగారెడ్డి, నాయకులు దుద్యాల ప్రశాంత్, వెంకట్‌పాటిల్, దిగంబర్‌రావు, అరవింద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# గొప్పలు తప్ప.. చేసిన అభివృద్ధి శూన్యం

**: మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 200కోట్ల నిధులు తెచ్చానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నాడు తప్ప.. చేసిన అభివృద్ధి శూన్యమని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిన వంద పడకల దావఖాన, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. వంద పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన పనులే ఉన్నాయన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఇంత వరకు వాటి వైపు కూడా చూడడం లేదని ఆరోపించారు. తన హయాంలోనే సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ ట్యాంకులు, స్మశాన వాటికలకు నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. అయినా వాటి పనులు కొన్ని ఇంకా అసంపూర్తిగా ఉంటాయని అగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా లక్కారం లోద్దికుంటకు మూసి జలాలను తరలిస్తానని గెలవగానే మాట ఇచ్చి తప్పాడని ఆరోపించారు. రైతులు డబ్బులు వేసుకుని, దివిస్ పరిశ్రమ పైసలిస్తేనే ఎమ్మెల్యే పనులు ప్రారంభించడానికి ముందుకొచ్చారని స్పష్టం చేశారు. ఇన్ని రోజులు ఈ పనులు ఎందుకు చేయలేదని ఆయన ప్రశ్నించారు. ఫ్లై ఓవర్ పనులు ఆలస్యం అవ్వడంతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ము, దూలికి వ్యాపారాలు నడుపుకునే పరిస్థితి లేదన్నారు. ఈ మున్సిపాలిటీ మంచినీటి కోసం అమృత్ పథకంలో భాగంగా రూ.25కోట్ల నిధులు తన హయాంలో తెచ్చిన ట్యాంకుల నిర్మాణం పూర్తి కాలేదన్నారు. బెల్ట్ దుకాణాల బంద్ మాటలకే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో ఒకలా ఎక్సైజ్ పాలసీ ఉంటే మునుగోడులో ఇంకోలా ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. తన పాలనా కాలంలోనే ఈ ప్రాంతానికి అధిక నిధులు తెచ్చినట్లు తెలిపారు. తేని నిధులను ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తానే తెచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఒకవేళ ఆయన నిధులు తీసుకొచ్చినది వాస్తవమే అయితే నిధుల జీఓ కాపీలను చూపించాలన్నారు. ఈ నిధులపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. ఈసమావేశంలో పిఎసిఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ముటుకుల్లోజు దయాకరాచారి, తాడూరి పరమేష్, చిన్నం బాలరాజు, కొయ్యడ శేఖర్ గౌడ్, సుర్కంటి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఫిర్యాదులపై తక్షణ స్పందనతో భాదితులకు భరోసా

*** ముస్తాబాద్ పోలీసుల పని తీరు బేష్**
*** జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పోలీస్ స్టేషన్‌కి వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకొని భరోసా కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ గురువారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాల వివరాలు, స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేసి, స్టేషన్ భౌగోళిక మ్యాప్ పరిశీలించి, క్రైం హాట్స్పాట్స్‌పై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులకు క్షుణ్ణంగా రివ్యూ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు, నేరాల స్థితిగతులపై సవివరంగా అడిగి తెలుసుకుని విలేజ్ పోలీస్ అధికారి వ్యవస్థను పకడ్బందీగా అమలు చేస్తూ గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గతంతో పోలిస్తే నేరాల రేటు తగ్గుముఖం పట్టిందని, కేసుల విచారణలో త్వరగతిన దర్యాప్తు, సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దక్పథం అవసరమని తెలిపారు. పోలీస్ స్టేషన్ అధికారులు,సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5 ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రతను కాపాడాలని, ఫైళ్లను క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉంచాలని,ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ లపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా చెక్ పెట్టేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు పటిష్టంగా ఉండేలా ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ,విజిబుల్ పోలీసింగ్‌పై దష్టి సారించాలని ఈసందర్భంగా ఎస్పీ సూచించారు. అలాగే మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని, యువతలో చట్టం పట్ల గౌరవం పెంపొందించేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు తలెత్తుతున్న సమస్యలకు తక్షణమే స్పందించి సత్వర సేవలందించేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ నుండి టాయించబడిన పెట్రోకార్, బొలెరో, ద్విచక్ర వాహనాల నిర్వహణపై అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్ర చారి, సిఐ మొగిలి, ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్. గణేష్ ఉన్నారు.



# ప్రజాస్ఫూర్తి తెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : పత్రికా ప్రపంచంలో వాస్తవ కథనాలకు ప్రతిరూపంగా,నిజాలు నిర్భయంగా ప్రచురించడంలో ప్రజాస్ఫూర్తి తెలుగు దినపత్రిక అగ్రభాగాన ఉందని వ్యాపారవేత్త శెట్టి హరికాంత్ గుప్తా అన్నారు.గురువారం మేడిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజాస్ఫూర్తి దినపత్రిక నూతన సంవత్సరం (2026)క్యాలెండర్ ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ,. పలువురు జర్నలిస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వాయు నాణ్యతపై దృష్టి పెట్టండి: జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్

వాయు నాణ్యత ను మెరుగుపరిచేందుకు ప్రభుత్వ శాఖలు , విభాగాలు కలిసి కట్టుగా పనిచేయాలనీ జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ అన్నారు. గురువారం జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం(ఎన్సీఏపీ) అమలును వేగవంతం చేయడానికి భాగంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సిటీ లెవల్ మానిటరింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (సీఎల్ఎంఐసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ నగరంలో గాలి కాలుష్య నియంత్రణకు సంబంధించిన విభాగాల పనితీరును సమీక్షించారు. సమావేశంలో హాట్‌స్పాట్‌ల వారీగా వాయు నాణ్యత పరిస్థితులు, ప్రస్తుత అమలు స్థితి, రోడ్డు ధూళి నియంత్రణ, వాహన కాలుష్యం తగ్గింపు, పరిశ్రమలు సీ అండ్ డీ వేస్ట్ కార్యకలాపాలపై పర్యవేక్షణ వంటి అంశాలను విశ్లేషించారు. నగరంలో కాలుష్యాన్ని కనీస స్థాయికి తగ్గించి వాయు నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులకు అదనపు కమిషనర్ సూచించారు. సమావేశంలో సాలీడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ విభాగం సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ టెక్నికల్ కన్సల్టెంట్ సుధాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రిపబ్లిక్ పరేడ్‌లో తెలుగు రాష్ట్రాల శకటాలకు నో ఛాన్స్

దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 26న జరగనున్న రిపబ్లిక్ పరేడ్‌లో ఈసారి ఇరు తెలుగు రాష్ట్రాల శకటాల ప్రదర్శనకు అవకాశం దక్కలేదు.కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న రొటేషన్ పాలసీ కారణంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు మినహాయించబడ్డాయి. కర్తవ్య పథ్‌లో ఈసారి మొత్తం 30 శకటాలు మాత్రమే ప్రదర్శించనుండగా.. అందులో 17 రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాలుఉండగా.. మరో 13 కేంద్ర శాఖల శకటాలు ఉంటాయి. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ రొటేషన్ విధానం అమలు చేస్తున్నారు. 2024-2026 రొటేషన్ సైకిల్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, గోవా, ఝార్ఖండ్, ఢిల్లీ, కొన్ని ఈశాన్య రాష్ట్రాలు కూడా ఎంపిక కాలేదు.

## చిల్డ్రన్ ప్లే పార్క్ ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 లో 3.10 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన చిల్డ్రన్ ప్లే పార్క్ ను హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. చిల్డ్రన్ ప్లే పార్క్ లో పిల్లలు ఆడుకునే ఆట స్థలాలు, టెన్నిస్ కోర్టు, యోగా స్థలాలు, వాటర్ స్టోరేజ్ ప్లేస్, గార్డెన్ లను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,మేయర్ గద్వాల విజయ లక్ష్మీ తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ టెన్నిస్ ఆడారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 44, 45 మధ్యలో లో ఖాళీగా ఉపయోగంలో లేకుండా ఉన్న ప్రాంతంలో ఒక ఎకరం 40 గుంటల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు మూడు కోట్ల రూపాయలతో చిల్డ్రన్ ప్లే పార్క్ ను అభివృద్ధి చేయడం జరిగింది అని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. 10 లక్షల లీటర్ల వర్షపు నీటిని నిల్వ చేసే స్టోరేజ్ ప్లాంటు ,వాకింగ్ ట్రాక్ , యోగ ,టెన్నిస్ కోర్టు తో ఈ పార్క్ అభివృద్ధి చేశామని, ఈ ప్రాంతంలో నివసించే వారు పిల్లలను తీసుకొని ఎంటర్టైన్మెంట్ , సేద తీర్చుకోవటానికి ఉపయోగపడుతుందని, దీనిని ప్రజలంతా ఉపయోగించుకోవాలి అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించిన అన్ని రకాల ప్రణాళికలతో కార్యక్రమాలు చేస్తున్నారు అని తెలిపారు. మౌలిక సదుపాయాలు హైదరాబాద్ లో ఇన్క్లూజివ్ గ్రోత్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయడం జరుగుతుంది అని రాబోయే తరాల వారికి హైదరాబాద్ ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్,జోనల్ కమిషనర్ ప్రియాంక అలా , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'హైదరాబాద్‌కు రండి'.. నాదిర్ గోద్రేజ్‌ను ఆహ్వానించిన మంత్రులు




ప్రపంచ ఆర్థిక వేదిక(WEF)-2026 సందర్భంగా తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గోద్రేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రేజ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయిల్ ఫామ్ వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు(AI) వినియోగం, హైదరాబాద్‌లో ఉన్న గోద్రేజ్ క్రీమ్‌లైన్ డెయిరీ ప్లాంట్‌ను రూ.150 కోట్ల పెట్టుబడితో విస్తరించే అవకాశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ నివాస ప్రాంతంలో భారీ గృహ నిర్మాణాల ప్రాజెక్టులు చేపట్టే అంశంపై మాట్లాడారు. ఫ్యూచర్ సిటీలో మౌలిక వసతులు (స్కూళ్లు, ఆసుపత్రులు, కమ్యూనిటీ సౌకర్యాలు) ఏర్పాటు చేయడం ప్రభుత్వానికీ, సంస్థకూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలంగాణ ప్రతినిధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. నాదిర్ గోద్రేజ్‌ను హైదరాబాద్‌కు రావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు.

## వాహనదారులు బాధ్యతతో వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాల రహిత సమాజం

* ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
* వేములవాడలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు
* ఆటోలతో పట్టణంలో అవగాహన ర్యాలీ



ప్రజాస్ఫూర్తి,సిరిసిల్ల : వాహనదారులు బాధ్యతతో వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాల రహిత సమాజం నిర్మించవచ్చని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రతి వాహనదారుడు తమ వాహనాన్ని భద్రంగా, బాధ్యతగా వాహనాలు నడపాలని పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో గురువారం జిల్లా రవాణా శాఖా ఆద్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితే హాజరై ప్రారంభించారు. ట్రాఫిక్ సిగ్నల్ రంగులలాగా సిద్దం చేసిన బెలూన్లను, శాంతి కపోతాలను ఎగురవేసారు. రోడ్డు భద్రతకు సంబంధించిన స్టికర్లను వాహనాలకు అతికించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని స్పష్టం చేసారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోతే ఆ కుటుంబం చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని వివరించారు. ప్రతి వాహనదారుడు ఓవర్ స్పీడ్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. ట్రాక్టర్ డ్రైవర్లు జాగ్రతగా నడపాలని పేర్కొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ కు వచ్చే రహదారులకు మరమ్మత్తు చేయిస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని, హెల్మెట్ ధరించని వారికి పెట్రోల్ బంక్ యజమానులు సామాజిక బాధ్యతగా పెట్రోల్ పోయవద్దని కోరారు. శివరాత్రి సందర్భంగా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు, భక్తులను ఆటో డ్రైవర్లు క్షేమంగా గమ్యం చేర్చాలని సూచించారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. వాహనాలు అతివేగంగా నడపవద్దని, మొబైల్ చూస్తూ వాహనాలు నడపవద్దని, స్కూల్ ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకువెళ్ళవద్దని సూచించారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు, ఆటో వారికి ఇబ్బంది అవుతుందని తెలిపారు. నో హెల్మెట్.. నో పెట్రోల్ జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పిలుపునిచ్చారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారణకు కషి చేస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని మొదటి గంటలో దవాఖనకు తరలించిన వారికి రహవీర్ పథకం కింద రూ.25 వేల ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించారు. ఎస్పీ మహేష్ బీ గితే మాట్లాడారు. హై స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. పరిమితికి మించి ప్రయాణీకులను వాహనాల్లో తీసుకువెళ్ళవద్దని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల, రోడ్డు ప్రమాదాల సమాచారం ఆటో డ్రైవర్లు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రుత్విక్ సాయి, ఆర్డీఓ రాధాభాయి, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, ఎంవీఐ వంశీధర్, ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ రాశ్, సిరిసిల్ల,వేములవాడ డిపో మేనేజర్లు ప్రకాష్ రావు,హౌ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## మహాత్మాగాంధీ నగర్ కాలనీ సమస్యలపై కార్పొరేటర్ పాదయాత్ర

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని మహాత్మాగాంధీ నగర్ కాలనీ లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనుల పై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులు , కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ నగర్ కాలనీలో కొంతమేర డ్రైనేజీ , సీసీ రోడ్లకు సంబందించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని, వాటిని శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి , సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంక్షన్ చేయించి అతి త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారు. కాలనీ లో మంజీరా వాటర్ ప్రెషర్ లేక ఇబ్బంది పడుతున్నామని కాలనీ మహిళలు కార్పొరేటర్ గారికి తెలియచేయగా కార్పొరేటర్ గారు సంబంధిత జలమండలి అధికారులతో మాట్లాడి త్రాగు నీటి ప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పాదయాత్ర లో భాగంగా ఎల్లమ్మబండ ప్రభుత్వ హాస్పిటల్ లో ఆకస్మిక తనిఖీ చేసి ప్రభుత్వ హాస్పిటల్ లో అందుతున్న వైద్య సేవలు మరియు సదుపాయల గురించి రోగులను , వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, ప్రదీప్ రెడ్డి, వెంకట్ యాదవ్, గోపాల్, గుడ్ల శ్రీనివాస్, పోశెట్టిగౌడ్, రామస్వామి, శివదుర్గ రెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకట్, ప్రభు యాదవ్, సతీష్, రాజు నాయక్, మల్లేష్, లింగం, సుధాకర్, సత్తయ్య, రమేష్, రవీందర్, ఖలీమ్. జి.ఎచ్.ఎమ్.సి అధికారులు ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, యుబీడి నాగరాణి, వాటర్ వర్క్స్ సూపర్వైజర్ శివ, ఎస్.ఎఫ్.ఎ వెంకటరెడ్డి & మల్లేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌పై రాజకీయ వేధింపులు ఆపాలి: ఎమ్మెల్సీ




రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా కక్ష సాధింపు చర్యలకే పరిమితమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు. హరీశ్‌రావును, కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ సిట్ నోటీసులు పంపడం కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యే అని అన్నారు. బొగ్గు కుంభకోణం మంటల నుండి తన కుర్చీని కాపాడుకోవడానికి రేవంత్‌రెడ్డి ఆడుతున్న డ్రామా అని ఎద్దేవా చేశారు. తన ఒంటికి అంటుకున్న బొగ్గు మరకలను కేటీఆర్‌కు పంపిన నోటీసు కాగితాలతో తుడిచేసుకోవాలని చూడటం ఆయన వెర్రితనమని అన్నారు. వేల కోట్ల రూపాయల బొగ్గు స్కామ్ రాష్ట్రాన్ని కుదిపేస్తున్నది. దీనిపై ప్రజల్లో జరుగుతున్న చర్చను దారి మళ్లించడానికి, పాతబడి తుప్పు పట్టిన ఫోన్ ట్యాపింగ్ అస్త్రాన్ని రేవంత్‌రెడ్డి మళ్ళీమళ్ళీ ప్రయోగిస్తున్నారని తెలిపారు. అందుకే ఆయనకు డైవర్షన్ కింగ్ అనే బిరుదు వంద శాతం సరిపోతుంది. ఇప్పటికైనా ఈ చిల్లర రాజకీయాలు, డ్రామాలు కట్టిపెట్టి ప్రజలకు మేలు చేసే పనుల మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు.

# పప్పుల్ని ఇలా తినాలట!

**మనం ఏది తిన్నా ఆరోగ్యం కోసమే! అయితే ఆయా ఆహార పదార్థాల్ని తీసుకునే క్రమంలో కొన్ని కచ్చితమైన నియమాలు పాటిస్తేనే అందులోని పోషకాలు శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలోనే పప్పుల్ని తీసుకునే విషయంలో కొన్ని అంశాలు దృష్టిలో పెట్టుకోవాలంటున్నారు. పప్పుల్లో ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు.. వంటి పోషకాలే కాదు.. వీటి పనితీరుకు ఆటంకం కలిగించే యాంటీ న్యూట్రియంట్లు కూడా ఉంటాయి. ఇవి పోషకాల్ని శరీరం గ్రహించకుండా అడ్డుపడతాయి. తద్వారా అజీర్తి, కడుపుబ్బరం, గ్యాస్ట్రిక్ సమస్యలు.. వంటివి తలెత్తే ప్రమాదం ఉంది. అందుకే ఈ సమస్యలు రాకూడదంటే పప్పుల్ని ఆహారంగా తీసుకునే క్రమంలో కొన్ని జాగ్రత్తలు పాటించడం ముఖ్యమంటున్నారు నిపుణులు.**




**మొలకెత్తాకే..!**

చాలామందికి పప్పుల్ని నేరుగా వండుకోవడం లేదంటే వివిధ వంటకాల్లో భాగం చేసుకోవడం అలవాటు. కానీ ముందు వీటిని నానబెట్టి, మొలకలొచ్చాక వండుకునే వారు చాలా తక్కువమంది ఉంటారు. కానీ ఇలా చేయడం వల్ల యాంటీ న్యూట్రియంట్లను విచ్ఛిన్నం చేసే ఎంజైమ్‌లను ప్రేరేపించచ్చంటున్నారు నిపుణులు. ఎందుకంటే పప్పుల్లో ఉండే పోషకాల్ని శరీరం గ్రహించకుండా ఈ యాంటీ న్యూట్రియంట్లు అడ్డుపడతాయి. అదే నానబెట్టి, మొలకెత్తిన పప్పుల్లో వీటి శాతం తగ్గిపోతుంది. తద్వారా సూక్ష్మ పోషకాలు, ప్రొటీన్.. వంటివి శరీరానికి అందుతాయి. ఫలితంగా జీర్ణశక్తి మెరుగుపడి వివిధ రకాల జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు.

**ఇలా కూడా..!**

సాధారణంగా చాలామంది కంది, పెసర, శెనగ.. వంటి పప్పుల్నే రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటారు. కానీ మన దేశంలో ఎన్నో రకాల పప్పులు, కాయధాన్యాలు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి వారానికి కనీసం ఐదు రకాలనైనా ఆహారంలో భాగం చేసుకుంటే అటు వాటిలోని పోషకాలు శరీరానికి అందుతాయి.. అలాగే వాటి రుచినీ ఆస్వాదించచ్చు. ఈ క్రమంలో వీటితో పచ్చళ్లు, ఇడ్లీ, దోసె, లడ్డూలు, హల్వా, పాపడ్.. వంటివి తయారుచేసుకొని తినచ్చు. తద్వారా పొట్టలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెంది.. జీర్ణ వ్యవస్థ పని తీరు మెరుగుపడుతుంది అంటున్నారు నిపుణులు.





# మీకు ఏ కర్టెన్?

ఫ్యాషనే కాదు... ఇంటికోసం ఏం కొనాలన్నా... ఇప్పుడు ట్రెండ్ ఏంటి అనే కొంటుంటాం కదా! కానీ ఇంటీరియర్ నిపుణులు ఏమంటారో తెలుసా? మీకు అనువైనవేంటి అని చూసుకోమంటారు. అంటే... ఇప్పుడంటే చలికాలం కానీ చలి నెమ్మదిగా తగ్గుతోంది. ఇన్నిరోజులూ వెలుతురు రావాలి, కోజీగా కనిపించాలంటూ ఎన్నో ప్రయోగాలు చేశాం. కానీ వచ్చేది వేసవి. ఎండ ప్రభావం మామూలుగా ఉండదు. ఆ వేడి నుంచి తప్పించుకోవాలి అనుకోండి. ముదురు రంగులు ఎంచుకోండి. అవైతే ఎండని ఆపుతాయి. దీంతో గది చల్లగా ఉంటుంది. లేదు, ఇల్లంతా వెలుగు రావాలి అంటారా... న్యూట్రల్ కలర్స్‌ని ఎంచుకుంటే సరి. ఇవైతే ఏరకం ఇంటీరియర్‌కైనా నప్పుతాయి. అంతేకాదు, గది కూడా విశాలంగా కనిపిస్తుంది. మీది మినిమలిస్టిక్ డెకార్ అనుకోండి... కాటన్, లినెన్‌వి నప్పుతాయి. సంప్రదాయ అలంకరణ ఇష్టపడేవాళ్లు వెల్వెట్ , బ్రొకేడ్ రకాలు ఎంచుకుంటే మేలు. బరువుగా ఉంటే జరిపినా త్వరగా లొంగవు, తేలికగా ఉంటే కుదురుగా ఉండవు. కాబట్టి, ఏది ఎంచుకున్నా మరీ బరువుగా, మరీ తేలికగా ఉండకుండా చూసుకోవాలి. అలాగే ఎంచుకునేటప్పుడు ఎలా ఉతకాలి అన్నది చూడటం మర్చిపోవద్దు. గమనించుకుంటారుగా మరి?

# అనాథ ఆస్తిపై రాబందు చూపు..సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ మార్చి మరీ వంశీధర్ మాయాజాలం

నందిగామ: "దొంగలు మారుతారు.. కానీ వారి బుద్ధి మారదు" అనే సామెతకు నిలువెత్తు నిదర్శనం నందిగామకు చెందిన ఘరానా మోసగాడు వేజండ్ల వంశీధర్. నకిలీ పత్రాలు సృష్టించి అనేక ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల నుండి లోన్ లు పొందుతున్నాడు వేజండ్ల వంశీధర్. 2018లో వారసులు లేని ఆస్తిపై నకిలీ పత్రాలు సృష్టించి పోలీసులకు చిక్కిన ఇతగాడు, కొన్నాళ్లు స్తబ్దుగా ఉండి ఇప్పుడు రూట్ మార్చాడు. నందిగామలో తన పప్పులు ఉడకవని గ్రహించి, ఏకంగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌నే మార్చేసి, పక్క మండలంలో రిజిస్ట్రేషన్లకు తెగబడుతూ తన నేర ప్రవృత్తిని చాటుకుంటున్నాడు.

ఫ్లాష్‌బ్యాక్: 2018 నాటి 'డెత్' డ్రామా నందిగామ టౌన్‌లోని సర్వే నెం. 475/5లో గోనెల వెంకటప్పయ్యకు చెందిన 10 సెంట్ల ఖరీదైన స్థలం ఉంది. దానికి వారసులు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకున్న వంశీధర్, తన అనుచరులైన గడ్డం కిషోర్ , బలుసుపాటి వెంకటేశ్వరరావులతో కలిసి భారీ స్కెచ్ వేశాడు.

నకిలీల సృష్టి: యజమాని వెంకటప్పయ్య 1972లోనే చనిపోయినట్లు, 1970లోనే వీలునామా రాసినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు.

అధికారుల ఫోర్జరీ: ఏకంగా వీఆర్వో సంతకాన్నే ఫోర్జరీ చేసి పొజిషన్ సర్టిఫికెట్ సృష్టించి, డాక్యుమెంట్ నెం. 2000/2018 ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

పోలీసుల ఎంట్రీ: దీనిపై జరబన నాగేశ్వరరావు ఫిర్యాదు చేయడంతో నందిగామ పోలీసులు క్రైమ్ నెం. 341/2018 కింద కేసు నమోదు చేసి వంశీధర్‌ను A1 ముద్దాయిగా చేర్చారు.

దిమ్మతిరిగే ట్విస్ట్: 2026లో 'కంచికచర్ల' స్కెచ్..



పోలీసు కేసు నడుస్తుండగానే, వంశీధర్ తన పాత బుద్ధిని మళ్లీ బయటపెట్టాడు. నందిగామ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అయితే పాత రికార్డులు బయటపడతాయని గ్రహించి, తెలివిగా కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ (SRO Code: 618) ను ఎంచుకున్నాడు.

అదే వివాదాస్పద స్థలం: వంశీధర్ విక్రయిస్తున్నది వేరే ఏదో స్థలం కాదు. 2018లో ఏ సర్వే నంబర్ (475/5) పై అయితే కేసు నమోదైందో, ఇప్పుడు అదే నందిగామలోని సర్వే నెం. 4755 లోని 242 చదరపు గజాల స్థలాన్ని అమ్మకానికి పెట్టాడు.

అదే బోగస్ లింక్ డాక్యుమెంట్: ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. 2018లో పోలీసులు ఏ డాక్యుమెంట్ (2000/2018) అయితే ఫోర్జరీ అని తేల్చారో, ఇప్పుడు 2026లో అదే డాక్యుమెంట్‌ను లింక్ డాక్యుమెంట్‌గా చూపిస్తూ రిజిస్ట్రేషన్‌కు అప్లై చేశాడు.

కొత్త బకరా: ఈసారి చిటికల కార్తికేయ అనే వ్యక్తికి ఈ వివాదాస్పద భూమిని అంటగట్టేందుకు 2026 జనవరి 12న సేల్ డీడ్ (Sale Deed) సిద్ధం చేశాడు.

దొరికిపోయిన వైనం: నందిగామలోని ఆస్తిని (నందిగామ ఎస్.ఆర్.ఓ పరిధి), కంచికచర్ల ఎస్.ఆర్.ఓ లో రిజిస్ట్రేషన్ చేయించేందుకు వంశీధర్ చేసిన ప్రయత్నం రికార్డుల్లో స్పష్టంగా ఉంది. అప్లికేషన్ ఐడి 2606181768196787 ద్వారా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇది కేవలం మోసం మాత్రమే కాదు, రిజిస్ట్రేషన్ వ్యవస్థలోని లొసుగులను వాడుకుని కోర్టులను, పోలీసులను కూడా బోల్తా కొట్టించడమే. కేసులు, అరెస్టులు ఉన్నప్పటికీ.. ఆఫీసులు మార్చి మరీ అదే భూమిని అమ్మడానికి ప్రయత్నిస్తున్న వేజండ్ల వంశీధర్ చర్యలు అతడి నేర ప్రవృత్తి ఏ స్థాయికి చేరిందో చెబుతున్నాయి. 2018 నాటి ఫోర్జరీ డాక్యుమెంట్‌నే మళ్లీ ఇప్పుడు లింక్ డాక్యుమెంట్‌గా వాడటం అధికారుల నిర్లక్ష్యమా? లేక వంశీధర్ అతితెలివా? అనేది తేలాల్సి ఉంది.




## సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దావోస్ పర్యటనపై దుష్ప్రచారం తగదు

**: రవినాయుడు**

తిరుపతి: ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ దావోస్ పర్యటనపై వైకాపా శ్రేణులు దుష్ప్రచారం చేయడం దారుణమని శాప్ ఛైర్మన్ రవి నాయుడు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియం, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ, క్వాంటం కంప్యూటర్లు, బయోటెక్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, రాష్ట్రాభివృద్ధి చేయడమే చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. గుడివాడ అమర్నాథ్ ఐటీ మంత్రిగా రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ పరిశ్రమలను తీసుకొచ్చి అభివృద్ధికి బీజం వేశారని కొనియాడారు. వైఎస్ జగన్ పాలనలో హత్యా రాజకీయాలు, విధ్వంసాలు, అరెస్టులు, బెదిరింపులు, దోపిడీలు మాత్రమే జరిగాయని విమర్శించారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. 201419 మధ్య చంద్రబాబు ప్రభుత్వం 5. 13 లక్షల ఉద్యోగాలు కల్పించిందని రవినాయుడు గుర్తు చేశారు.



## తిరుమలలో 'రథసప్తమి'.. 14 రకాల వంటకాలతో భక్తులకు అన్నప్రసాదాలు

**: బీఆర్ నాయుడు**

తిరుమల: తిరుమల శ్రీవారి సన్నిధిలో ఈనెల 25న రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఛైర్మన్ బి.ఆర్. నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో.. ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి ఏర్పాట్ల వివరాలను ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. "రథసప్తమి రోజున ఏడు వాహనసేవలపై మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనంతో ప్రారంభమై.. రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహన సేవతో వాహనసేవలు ముగుస్తాయి. వైకుంఠ ద్వార దర్శనాలు, బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాం. అలాగే రథసప్తమి వేడుకలను కూడా వైభవంగా నిర్వహిస్తాం. రద్దీ దృష్ట్యా తిరుపతిలో 24 నుంచి 26 వరకు సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్ల జారీ రద్దు చేశాం. మాడవీధుల్లో 3,700 మంది శ్రీవారి సేవకుల సాయంతో 14 రకాల వంటకాలతో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. 1,260 మంది పోలీసులు, 1200 మంది విజిలెన్స్ సిబ్బందితో భక్తులకు భద్రతా ఏర్పాట్లు చేశాం. ఆర్టీసీ బస్సుల ద్వారా 2,300 ట్రిప్పులు నడిచేలా ప్రణాళికలు రూపొందించాం. వాహనసేవల ముందు 56 కళా బృందాలతో ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు ఉంటాయి. 2.50 లక్షల మంది భక్తులు రథసప్తమి వేడుకలకు వస్తారని అంచనా" అని తెలిపారు. అంతకుముందు తిరుమలలోని నాలుగు మాడవీధుల్లో తితిదే అధికారులతో కలిసి బీఆర్ నాయుడు తనిఖీలు చేశారు. రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తుల సౌకర్యాలపై తితిదే, విజిలెన్స్ అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు.


## జగన్.. రాష్ట్రాన్ని చోరీ చేసి.. క్రెడిట్ చోరీ గురించి మాట్లాడతారా?: మంత్రి గొట్టిపాటి

అమరావతి: క్యారెక్టర్ లేని మాజీ సీఎం జగన్ క్రెడిట్ గురించి మాట్లాడటం విడ్డూరమని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏం చేశారని ఆయనకు క్రెడిట్ ఇవ్వాలని మండిపడ్డారు. "వైకాపా హయాంలో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారు. విద్యుత్‌శాఖను జగన్ సర్వనాశనం చేశారు. 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి రూ.30వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేశారు. పీపీఏలు రద్దు చేశారు. వీటన్నింటి క్రెడిట్ కచ్చితంగా జగన్‌కు ఇవ్వాలి. మళ్లీ ఏం మొహం పెట్టుకుని ఆయన మాట్లాడుతున్నారు. వైకాపా అధికారంలో ఉండుంటే రాష్ట్రం అప్పులకుప్పగా మారడంతో పాటు విద్యుత్ వ్యవస్థ నిర్వీర్యం అయ్యేది. రాష్ట్రాన్ని చోరీ చేసిన జగన్.. క్రెడిట్ చోరీ గురించి మాట్లాడుతుంటే జనం నవ్వుకుంటున్నారు" అని గొట్టిపాటి రవికుమార్ అన్నారు.

## జూన్ తర్వాత మళ్లీ రాజకీయ ప్రవేశం గురించి చెబుతా

**: విజయసాయిరెడ్డి**

హైదరాబాద్: వచ్చే జూన్ తర్వాత మళ్లీ రాజకీయ ప్రవేశం గురించి మాట్లాడతానని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి (Vijayasai Reddy) తెలిపారు. ఏపీ లిక్కర్ స్కామ్‌లో ఈడీ విచారణ ముగిసిన తర్వాత మీడియాతో విజయసాయి మాట్లాడారు. "అధికారంలోకి వచ్చిన కొత్తలో నాకు నెంబర్ 2 స్థానం ఇచ్చారు. పనికిమాలిన కోటరీ వల్ల మెల్లగా బయటకు వచ్చా. నా దురదృష్టం వల్ల జగన్ కూడా కోటరీ మాటలు నమ్మారు. 2020 నుంచి నన్ను సైడ్‌లైన్ చేశారు. పార్టీ నుంచి ఎందుకు వెళ్లారని నన్ను ప్రశ్నించారు. మద్యం స్కామ్ అనేదాన్ని నేను నమ్మడం లేదని చెప్పా. నేను రూ.వందల కోట్లు సంపాదించానని కోటరీ ఆరోపణలు చేసింది. నా కుమార్తెను ఇచ్చినంత మాత్రాన ఆ ఆస్తులన్నీ నావి కావు. విశాఖలో ఆస్తులు సంపాదించానని నాపై దుష్ప్రచారం చేశారు. నా ఆస్తులని రుజువైతే





రాజకీయాల నుంచి తప్పుకొంటానని చెప్పా. విశాఖలో ఒక్క అపార్ట్‌మెంట్ తప్ప నాకేమీ లేదు. నాపై దుష్ప్రచారం చేసిన వారికి సరైన బుద్ధి చెప్పాలని కోరుకుంటున్నా. నాకు సంబంధంలేని విషయాల్లో నన్ను ఇరికించారు. విజయసాయిరెడ్డి భయపడే వ్యక్తి కాదు. అధికారం అనేది ఎవరికీ శాశ్వతం కాదని గ్రహించాలి. నేను రాజకీయాల నుంచి విరమించుకోలేదు. రాజకీయాల్లో స్ట్రాటజీ ఉండాలి.. అలాగే ముందుకెళ్లాలి. ఏడాదిగా నేను వ్యవసాయం చేసుకుంటున్నా. అప్పుడప్పుడు ట్వీట్లు మాత్రమే పెట్టా. నేను ఎవరినీ విమర్శించలేదు.. జగనే నన్ను విమర్శించారు. విజయసాయి ఎవరి వద్ద చెయ్యి చాచడు. నాపై చేసిన వ్యాఖ్యలను జగన్ విత్‌డ్రా చేసుకోవాలి. జగన్ వద్ద నేను పాలేరులా పనిచేశా. కోటరీ మాటలు నమ్మి పొగబెట్టి బయటకు పంపించారు. నా సమాధానాలు కొన్నింటిని ఈడీ అధికారులు రికార్డు చేశారు. మరి కొన్ని సమాధానాలు మాత్రం రికార్డు చేయలేదు. మద్యం స్కామ్ జరిగిందా? లేదా? అని అడిగారు. నాకు తెలియదని చెప్పా. ఆ స్కామ్‌లో ఉన్నవారినే అడగాలని చెప్పా. నెంబర్ 2 మీకు తెలియదా అని అడిగారు. ప్రాంతీయ పార్టీల్లో నెంబరు 2 స్థానం ఉండదు. నెంబరు 2 అని నాపై ముద్రవేశారు. కేసుల విషయంలో నేను నెంబర్ 2 అవుతాను. లాభాల విషయంలో మాత్రం నా స్థానం వంద తర్వాతే. నన్ను మళ్లీ విచారణకు పిలుస్తారని అనుకుంటున్నా" విజయసాయిరెడ్డి తెలిపారు.

## ఏపీలో టాటా గ్రూప్ ప్రాజెక్టులు వేగవంతం చేయండి

**: సీఎం చంద్రబాబు**


దావోస్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ ఏడాది దావోస్ పర్యటనపై ముఖ్యమంత్రిని.. చంద్రశేఖరన్ అడిగి తెలుసుకున్నారు. ప్రపంచ పారిశ్రామిక రంగ పోకడలు, పారిశ్రామిక వేత్తల ఆలోచనలు తెలుసుకోవడానికి ఇదో మంచి వేదిక అని సీఎం అన్నారు. ఏపీని బ్రాండ్ చేయడానికి, కొత్త పాలసీలపై మార్కెట్‌లో అంచనా వేయడానికి ఈ పర్యటన ఎంతో దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. 2025 దావోస్ పర్యటనలో జరిపిన చర్చల్లో ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయని చంద్రబాబు చెప్పారు. మూడు



రోజులు వేర్వేరు సమావేశాల ద్వారా గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఏఐ, అగ్రికల్చర్, టూరిజం వంటి రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న విజయాలు వివరించామన్నారు. గతంతో పోలిస్తే భారత్ పట్ల ప్రపంచ దిగ్గజ సంస్థలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. యువశక్తి, సమర్థ నాయకత్వం, పాలసీల కారణంగా నేడు ప్రతీ రంగంలో భారత్‌లో కంపెనీల స్థాపనకు అవకాశాలు పెరుగుతున్నాయని సీఎం అభిప్రాయపడ్డారు. వివిధ రంగాల్లో ప్రపంచ దిగ్గజ కంపెనీల ఆలోచనలు, తన అనుభవాలను టాటా సన్స్ ఛైర్మన్ పంచుకున్నారు. విశాఖలో టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్, అమరావతి క్వాంటం వ్యాలీ, కర్నూలులో తలపెట్టిన సోలార్ పవర్ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా చేపట్టే కార్యక్రమాల నిర్వహణపై టాటా ట్రస్ట్ నుంచి ప్రత్యేకంగా అధికారులను పంపి దీనిపై చర్చిద్దామని చంద్రశేఖరన్ చెప్పారు. రాష్ట్రంలో టాటా గ్రూపు చేపట్టిన టూరిజం ప్రాజెక్టులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో 3 స్పోర్ట్స్ సిటీలు నిర్మించే ఆలోచనలో ఉన్నామని, ఈ రంగంలో పెట్టుబడులకు అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో టాటా గ్రూప్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కోరగా అన్నింటినీ సమీక్షించి ప్రాజెక్టుల పూర్తికి సహకరిస్తామని టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల మీదుగా అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్: తెలంగాణకు మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను కేటాయిస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ రైలు తెలుగు రాష్ట్రాల మీదుగా వెళ్లడం ప్రయాణికులకు ఉపయుక్తం కానుంది. చర్లపల్లి జంక్షన్ నుంచి తిరువనంతపురం మధ్య సూపర్ ఫాస్ట్ రైలును కేటాయించింది. శుక్రవారం తిరువనంతపురం నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభించనున్నారు. తెలంగాణలో నల్గొండ, మిర్యాలగూడ.. ఆంధ్రప్రదేశ్‌లోని సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఆగనుంది. తిరువనంతపురంలో ఉదయం 10.45 గంటలకు ప్రారంభమై.. చర్లపల్లికి మరుసటి రోజు




సాయంత్రం 4.30 గంటలకు చేరుకుంటుంది. తెలంగాణకు మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ కేటాయించడం పట్ల.. ప్రధాని మోదీకి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

**తొలి రైలు ఇలా..**

ఇప్పటికే చర్లపల్లి ముజఫర్‌పూర్ (బిహార్) మధ్య ఒక అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడుస్తోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక వసతులున్న అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను కేంద్రం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. చర్లపల్లి ముజఫర్‌పూర్ మధ్య అమృత్ భారత్ రైలు తెలంగాణలోని చర్లపల్లి నుంచి ఉదయం 4.05 గంటలకు ప్రారంభమై.. కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, సిర్పూర్ కాగజ్‌నగర్ మీదుగా మహారాష్ట్రలోకి అడుగుపెడుతుంది. ముజఫర్‌పూర్‌కు మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు చేరుకుంటుంది.

## కాపీయింగ్‌కి వీలు లేకుండా కమాండ్ కంట్రోల్ సెంటర్

**: మంత్రి సత్యకుమార్**

విజయవాడ: ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన వర్సిటీలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మంత్రి సత్యకుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా 37 వైద్య విద్య కళాశాలల్లో పరీక్షలను పర్యవేక్షించవచ్చని చెప్పారు. మాల్ ప్రాక్టీస్ వంటివి జరిగితే ఈ సెంటర్‌ద్వారా తక్షణం గుర్తించవచ్చని తెలిపారు. కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా చేస్తామన్నారు. నాణ్యమైన విద్యను తీసుకురావాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. హైక్వాలిటీ చిత్రీకరణతోపాటు 70 రోజులు వీటిని స్టోర్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. నిత్య జీవితంలో సాంకేతికత కీలకంగా మారిందని తెలిపారు. ఈ సాంకేతికతను ఉపయోగించడం వల్ల పర్యవేక్షణ సిబ్బంది సంఖ్య తగ్గనున్నట్లు వివరించారు. ప్రస్తుతం 5 వైద్య విద్యా కళాశాలలను ఈ సెంటర్‌కింద తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. భవిష్యత్తులో అన్ని వైద్య విద్యా కళాశాలల్లో



ఈ కమాండ్ కంట్రోల్ సేవలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. త్వరలో ఆయుష్, నర్సింగ్ కళాశాలలను కమాండ్ కంట్రోల్ పరిధిలోకి తెస్తామని వెల్లడించారు.

# అంతటి నిస్సహాయతలో ఉన్నారా? - సీఎంకు బాంబే హైకోర్టు చురకలు


మహారాష్ట్ర ప్రభుత్వం తీరుపై బాంబే హైకోర్టు తీవ్ర స్థాయిలో మండిపడింది. రాష్ట్రంలో చట్టబద్ధ పాలనా ఉందా? అని ప్రశ్నించింది. క్రిమినల్ కేసులో నిందితుడిగా ఉన్న ఓ మంత్రి కుమారుడు పరారీలో ఉంటే.. అతడికి వ్యతిరేకంగా ఏమీ మాట్లాడలేనంత నిస్సహాయ స్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారా? అని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో పోలీసుల తీరుపైనా ఉన్నత న్యాయస్థానం



అసంతృప్తి వ్యక్తం చేసింది. మహాద్ మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఇందులో శివసేన మంత్రి భరత్ గోగావలే కుమారుడు వికాస్ నిందితుడిగా ఉన్నాడు. పరారీలో ఉన్న అతడు.. ముందస్తు బెయిల్ కోసం బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ మాధవ్ జందార్.. మంత్రి కుమారుడు నేరం చేసి స్వేచ్ఛగా తిరుగుతుంటే.. పోలీసులు అతడిని అరెస్టు చేయలేకపోతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తీరునూ న్యాయమూర్తి తప్పుపట్టారు. "ఒక్క మంత్రికి వ్యతిరేకంగా మాట్లాడలేని నిస్సహాయ స్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారా? మంత్రి పిల్లలు నేరాలకు పాల్పడి స్వేచ్ఛగా తిరుగుతున్నారు. వాళ్ల తల్లిదండ్రులతో టచ్‌లోనే ఉన్నారు. అయినప్పటికీ.. పోలీసులు మాత్రం వాళ్లను కనిపెట్టలేకపోతున్నారు" అని జస్టిస్ మాధవ్ జందార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చట్టబద్ధపాలన ఉందా? అని ప్రశ్నించారు. అడ్వకేట్ జనరల్ మిలింద్ సాథే స్పందిస్తూ.. మంత్రి గోగావలే తన కుమారుడితో మాట్లాడి, లొంగిపోయేలా చూస్తారని హామీ ఇచ్చారు. దీంతో కేసు విచారణ మరుసటి రోజుకు వాయిదా పడింది.

## మూడు కిలోల వెండితో 'వివాహ ఆహ్వాన పత్రిక'

జైపూర్: బంగారం, వెండి ధరలు ఊహించని స్థాయిలో పెరిగిపోతున్నాయి. ఇటువంటి సమయంలో రాజస్థాన్‌కు చెందిన శివ్ జోహారీ.. తన కుమార్తె వివాహం కోసం మూడు కిలోల స్వచ్ఛమైన వెండితో ప్రత్యేకంగా ఓ ఆహ్వాన పత్రికను తయారు చేయించడం విశేషం. మొత్తం 128 విడిభాగాలతో రూపొందించిన ఈ పత్రికలో కనీసం ఒక్క మేకు లేదా స్క్రూ కూడా వినియోగించలేదట. దీన్ని తయారు చేసేందుకు దాదాపు రూ.25లక్షలు ఖర్చు అయినట్లు అంచనా. ఈ వెండి ఆహ్వాన పత్రికలో 65 దేవతా విగ్రహాలను పొందుపరిచారు. పైభాగంలో గణేశుడి రూపాన్ని, ఇరుపక్కల శివ పార్వతుల విగ్రహాలను, వీటి కింద లక్ష్మీదేవి, విష్ణుమూర్తుల చిత్రాలను పొందుపరిచారు. వెంకటేశ్వరుడు, శ్రీకృష్ణుడి చిత్రాలతోపాటు విష్ణువు పది



అవతారాలు కూడా ఉండటం విశేషం. మొత్తంగా దీన్ని తయారుచేసేందుకు దాదాపు ఏడాది సమయం పట్టిందని శివ్ జోహారీ పేర్కొన్నారు. తన కూతురి వివాహానికి బంధువులనే కాకుండా దేవుళ్లను ఆహ్వానించాలని కోరుకున్నానని, అందుకే దీన్ని తయారు చేయించానని అన్నారు.

## సభ నుంచి ఎందుకు వెళ్లిపోతున్నారు? మహిళలపై నీతీశ్ గరంగరం

బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పాల్గొన్న ఓ సభలో మరోసారి ఊహించని పరిణామం చోటుచేసుకుంది. మహిళల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తున్న సమయంలోనే సభ నుంచి మహిళలు నిష్క్రమించడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు వెళ్లిపోతున్నారంటూ వాళ్లపై మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా ఇటీవల మొదలుపెట్టిన 'సమృద్ధి యాత్ర'లో భాగంగా సివాన్ జిల్లాలో పర్యటించిన సీఎం నీతీశ్.. రూ.వందల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా



ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. మహిళలు, ఇతర వర్గాల కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అదే సమయంలో కొందరు మహిళలు సభ నుంచి వెళ్లిపోతుండటాన్ని గమనించిన సీఎం.. ఎక్కడికి వెళ్లిపోతున్నారు? మేం చెప్పేది వినకపోతే మీ కోసం ఏం చేస్తున్నామో ఎలా తెలుస్తుంది? అని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ మహిళలు ఆగకుండా వెళ్లిపోవడంతో మరింత ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. "మీకోసం ఎన్నో చేశాం. కూర్చొని వినండి.. లేదంటే బాగుండదు" అని తీవ్ర స్వరంతో చెప్పడం చర్చనీయాంశమైంది. ఇదిలాఉంటే, బిహార్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న నీతీశ్‌కు మహిళా ఓటర్లలో ప్రజాదరణ ఉంది.

## ప్రపంచంలో రెండో అత్యంత ట్రాఫిక్ రద్దీ నగరంగా బెంగళూరు

గత ఏడాదికి సంబంధించి ప్రపంచంలోనే అత్యంత ట్రాఫిక్ రద్దీ నగరంగా మెక్సికోలోని మెక్సికో సిటీ నిలిచింది. రెండో స్థానంలో కర్ణాటక రాజధాని బెంగళూరు (Bengaluru) ఉంది. ఈ నగరంలో 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటున 36 నిమిషాలకుపైగా సమయం పట్టినట్లు 'టామ్‌టామ్ ట్రాఫిక్ సూచీ2025 (TomTom Traffic Index)'లో వెల్లడైంది. డబ్లిన్ (ఐర్లాండ్), లోడ్జ్ (పోలండ్), పుణె (భారత్)లు టాప్5లో ఉన్నాయి.

* బెంగళూరులో సగటు రద్దీ స్థాయి 74.4 శాతంగా నమోదైంది. 2024తో పోలిస్తే 1.7 శాతం పెరిగింది. వాహనదారులు 15 నిమిషాల్లో సగటున 4.2 కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటున 36 నిమిషాల తొమ్మిది సెకన్ల సమయం పట్టింది. అత్యంత రద్దీ వేళల్లో సగటు వేగం గంటకు 13.9 కిలోమీటర్లకు పడిపోయిందని నివేదిక పేర్కొంది.

* ముఖ్యంగా 2025 మే 17న బెంగళూరులో ట్రాఫిక్ పరిస్థితి దారుణంగా ఉందని, ఆ రోజు సగటు రద్దీ స్థాయి 101 శాతంగా నమోదైనట్లు నివేదిక తెలిపింది. సాయంత్రం 6 గంటల సమయంలో వాహనదారులు 15 నిమిషాల్లో 2.5 కిలోమీటర్లే ప్రయాణించినట్లు



వెల్లడించింది.

* ఈ జాబితాలో ముంబయి (18), దిల్లీ (23), కోల్‌కతా (29), జైపుర్ (30), చెన్నై (32), హైదరాబాద్ (47) స్థానాల్లో నిలిచాయి. హైదరాబాద్‌లో గంటకు సగటు వేగం 18.4 కిలోమీటర్లుగా ఉందని నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 500 నగరాల్లో, 3.65 ట్రిలియన్ కిలోమీటర్లకుపైగా ప్రయాణ డేటా ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు సంస్థ తెలిపింది.

## ఓట్ల కోసమే మోదీ 'చాయ్‌వాలా' కబుర్లు: ఖర్గే

ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. తనకు తాను చాయ్‌వాలా అని మోదీ ప్రకటించుకుంటారని.. కానీ ఎప్పుడైనా ఆయన చాయ్ పెట్టారా? అని ప్రశ్నించారు. ఓట్ల కోసమే ఆయన ఇటువంటి ప్రచారాలు చేసుకుంటారని దుయ్యబట్టారు. దిల్లీలో నిర్వహించిన ఉపాధి హామీ కార్మికుల సదస్సులో పాల్గొన్న ఖర్గే.. కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "ఓట్ల కోసమే ఆయన (ప్రధానిని ఉద్దేశిస్తూ) చాయ్‌వాలా అని ప్రకటించుకుంటారు. కానీ ఎప్పుడైనా టీ చేశారా? టీ పట్టుకొని అమ్మారా? ఓట్ల



కోసమే ఇలాంటి కట్టుకథలు అల్లుతారు. బుల్లెట్ రైలు, వందేభారత్ రైలు అంటూ పచ్చజెండా పట్టుకొని పరుగులు పెడతారు. కానీ, కొత్త రైల్వే ట్రాక్‌లు మాత్రం వేయలేకపోయారు. కాంగ్రెస్ హయాంలో జవహర్ లాల్ నెహ్రూ ఎన్నో ప్రాజెక్టులు చేపట్టారు. మీరు ఒకటైనా నిర్మించారా?" అని ఖర్గే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఖర్గే వ్యాఖ్యలను భాజపా తప్పుపట్టింది. అర్బన్ నక్సల్స్ నుంచి భారత్‌ను మోదీ కాపాడుతున్నారని, అది సహించలేకే కాంగ్రెస్ ఇటువంటి విమర్శలు చేస్తోందని ఆరోపించింది. 'కాంగ్రెస్ అహంకారం ఎప్పటికీ తగ్గదు. రాహుల్ సూచనల మేరకు ఖర్గే దురుసుగా మాట్లాడుతున్నారు. మీరెప్పుడైనా టీ పెట్టారా? అంటూ మోదీని అవమానిస్తున్నారు. మోదీనే కాదు.. గతంలో ఆయన తల్లినీ అవమానించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ప్రజలే సరైన బుద్ధి చెబుతారు" అని భాజపా అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ పేర్కొన్నారు.

## 2026 అసెంబ్లీ ఎన్నికలు.. విజయ్ పార్టీ గుర్తు 'విజిల్'


తమిళనాడు అసెంబ్లీకి కొన్ని నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నటుడు విజయ్ పార్టీ తమిళిగ వెట్రి కళగం (టీవీకే)కు ఎన్నికల సంఘం గురువారం విజిల్ గుర్తును కేటాయించింది. అలాగే మరో నటుడు కమల్‌హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం)కు 'బ్యాటరీ టార్చ్' గుర్తును కేటాయించినట్లు వెల్లడించింది. తమ పార్టీకి ఎన్నికల గుర్తు కేటాయించాలని కోరుతూ టీవీకే (TVK) నవంబర్ 11న ఈసీని ఆశ్రయించింది. శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గుర్తింపుపొందని రాజకీయ పార్టీలు గుర్తు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్



సూచించిన నేపథ్యంలో వినతిని సమర్పించింది. అలాగే కమల్ పార్టీ నవంబర్‌లో వినతి పత్రం అందించింది. ఈ రెండు పార్టీలు కొన్ని చిహ్నాలు ఉన్న జాబితాను అందించి, వాటిలో ఒకదానిని కేటాయించాలని విజ్ఞప్తి చేశాయి. 2019 లోక్‌సభ ఎన్నికలు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్‌ఎం ఈ బ్యాటరీ టార్చ్ గుర్తుపైనే పోటీ చేసింది. తమిళంతో పాటు తెలుగులోనూ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సొంతం చేసుకున్న కథానాయకుడు విజయ్. ఆయన నటించిన సినిమాలు తెలుగులోనూ విడుదల అవుతుంటాయి. ఫుట్‌బాల్ ఆట నేపథ్యంలో అట్లీ దర్శకత్వం వహించిన బిగిల్ సినిమా.. మన దగ్గర 'విజిల్ 'పేరుతో రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఇదే పేరుతో ఉన్న గుర్తుతో విజయ్ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## 'వీజీ-జీరాంజీ'కి పాతపేరే కొనసాగించాలి: రాహుల్‌గాంధీ


జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించి 'వీబీ జీరాంజీ'పేరుతో కొత్త చట్టం తేవడాన్ని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తప్పుబట్టారు. పేదల పని హక్కులను హరించడమే భాజపా ప్రధాన ఉద్దేశమని ఆరోపించారు. దిల్లీలో నిర్వహించిన ఉపాధి హామీ కార్మికుల సదస్సులో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో రాచరిక పాలనను ప్రవేశపెట్టాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందన్నారు. ''గతంలోనూ రైతుల హక్కులను కాలరాసేందుకు కేంద్ర వ్యవసాయ రంగంలో మూడు చట్టాలను తీసుకొచ్చింది. అన్నదాతల ఆందోళనలతో వెనక్కి తగ్గింది. అదే మాదిరిగా ఇప్పుడు పేద కూలీలపై 'వీబీ జీరాంజీ'పేరుతో వారి పని హక్కులను హరించాలని చూస్తోంది. దేశంలో ప్రతిదీ రాజు (ప్రధాని) మాత్రమే నిర్ణయించాలనే కొత్త సిద్ధాంతాన్ని భాజపా సృష్టిస్తోంది''అని



ఆరోపించారు. వీజీజీరాంజీ పథకాన్ని రద్దుచేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ పెద్ద ఎత్తున అందోళనకు సిద్ధమైంది. ఈ నెల 10 నుంచి ఫిబ్రవరి 25 వరకు దేశవ్యాప్తంగా 'ఎంజీనరేగా బచావో సంగ్రాం' ఆందోళన కార్యక్రమం చేపడుతున్న విషయం తెలిసిందే.

## 'టీమ్ ఇండియా' అని పిలవొద్దంటూ పిటిషన్: సుప్రీంకోర్టు ఆగ్రహం

బీసీసీఐ నేతృత్వంలో ఏర్పాటైన జట్టును 'టీమ్ ఇండియా'గా అభివర్ణించకుండా ప్రసారభారతికి ఆదేశాలివ్వాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి పిటిషన్లతో కోర్టులపై భారం మోపొద్దంటూ పిటిషనర్‌కు చురకలంటించింది. న్యాయవాది రీపక్ కన్సల్ ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ప్రైవేటు సంస్థ అయిన బీసీసీఐ నేతృత్వంలోని జట్టును 'టీమ్ ఇండియా' 'భారత జాతీయ జట్టు' అని పిలవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని పేర్కొన్నారు. దీనికి కేంద్రం నుంచి కూడా ఎలాంటి అనుమతులు లేవని వాదించారు. దీనిపై ధర్మాసనం అసహనం వ్యక్తంచేస్తూ.. పిటిషన్‌ను కొట్టివేసింది. 'మీరు ఇంట్లో కూర్చుని ఇలాంటి పిటిషన్లు తయారుచేస్తున్నారు. ఈ పేరుతో మీకు వచ్చిన సమస్య ఏంటి?'



అని ధర్మాసనం న్యాయవాదిని ప్రశ్నించింది. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రతిచోటా ఆ జట్టు ఆడుతున్న విషయాన్ని ప్రస్తావించింది. ఈ పిటిషన్ దాఖలు చేయడం కోర్టు సమయంతో పాటు మీ సమయాన్ని కూడా వృథా చేయడమేనని మండిపడింది.

## ముంబయి మేయర్ పదవి మహిళకే.. గందరగోళానికి దారితీసిన లాటరీ

ముంబయికి ఓ మహిళ మేయర్‌గా రానున్నారు. అయితే ఈ ఎంపిక ప్రక్రియ మాత్రం వివాదాస్పదమైంది. ఈ పోస్ట్‌ను ఏ కేటగిరీకి కేటాయించాలనే దానిపై లాటరీ తీశారు. ఫలితాల్లో 'జనరల్ మహిళ' కేటగిరీ ఎంపికైంది. ఈ లాటరీ ప్రక్రియ, ఫలితంపై ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన అభ్యంతరం వ్యక్తంచేసింది. ఇది గందరగోళ పరిస్థితులకు దారితీసింది. మేయర్ పదవిని ఏ కేటగిరీకి కేటాయించాలనే దానిని నిర్ణయించేందుకు రాష్ట్రప్రభుత్వం లాటరీ సిస్టమ్‌ను అనుసరిస్తుంది. డ్రా పూర్తయిన తర్వాత బీఎంసీలోని అర్హులైన కార్పొరేటర్లు నామినేషన్లు వేసేందుకు వీలవుతుంది. ఈ లాటరీ ప్రక్రియ తర్వాత పుణె, ధూలే, బీఎంసీ, నాందేడ్, నవీ ముంబయి, మాలేగావ్, మీరా భయందర్, నాసిక్, నాగ్‌పూర్ మేయర్ పోస్టులు మహిళలకు రిజర్వ్ అయ్యాయి. అయితే ముంబయి మేయర్ పదవిపై మాత్రం ఉద్ధవ్ శివసేన అభ్యంతరం వ్యక్తంచేసింది. బీఎంసీని (ముంబయి) ఓబీసీ కేటగిరీ కింద ఎందుకు పరిగణించలేదని మాజీ మేయర్ కిశోరి ఫడ్నేకర్ ప్రశ్నించారు.

## ఒడిశాలో పొగాకు ఉత్పత్తులపై నిషేధం

భువనేశ్వర్: పొగాకు ఉత్పత్తులపై ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నికోటిన్ కలిగి ఉండే గుట్కా, పాన్ మసాలా, జర్దా, ఖైనీ వంటి ఉత్పత్తుల తయారీ, విక్రయం, నిల్వ, రవాణాపై రాష్ట్రవ్యాప్తంగా పూర్తి స్థాయిలో నిషేధం విధించింది. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, పొగాకు రహిత రాష్ట్రంగా ఒడిశాను తీర్చిదిద్దేందుకు సహకరించాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. ఒడిశాలో 42 శాతానికి పైగా పౌరులు సిగరెటేతర పొగాకును వినియోగిస్తున్నట్లు ఓ సర్వేలో తేలింది. ఇది జాతీయ సగటు కంటే అధికం. ఈ నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం పౌరుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంది.

## సినిమా

# నోరే అతిపెద్ద ఆయుధం



టాకీస్: మహిళలకు అతి పెద్ద ఆయుధం నోరే అంటోందీ బాలీవుడ్ నటీమణి ఐశ్వర్యరాయ్. ఏదైనా నచ్చనప్పుడు నిర్మొహమాటంగా 'కాదు' అని చెప్పగలగడమే ఒక మహిళకు ఉండే అసలైన శక్తి అని ఆమె అభిప్రాయ పడ్డారు. గతంలో ఆమె ఇచ్చిన ఒక ఇంట ర్వ్యూలో చెప్పిన ఈ మాటలు నేటికీ ఎంతో మందికి స్ఫూర్తినిస్తున్నాయి. కేవలం విజయాలు సాధించడమే కాదు, మన విలువలకు వ్యతిరేకంగా ఉన్నవాటిని తిరస్కరించడం కూడా గొప్ప విషయ మేనని ఆమె నొక్కి చెప్పారు. సమాజం మనపై రుద్దే అంచనాలను చూసి భయపడకుండా, వాటిని ఒక సవాల్‌లా తీసుకోవాలని ఐశ్వ ర్య పిలుపునిచ్చింది. ఏదైనా నచ్చకపోయినా లేదా మనవ ల్ల కాకపోయినా 'లేదు' అని చెప్పడం వల్ల మన ఆత్మవి శ్వాసం పెరుగుతుందని, అది మానసిక ప్రశాంతతకు ఎంతో మేలు చేస్తుందంటోంది. ఇదే విషయాన్ని సైకాలజిస్టు లు కూడా చెబుతున్నారు. ప్రతిదానికీ 'అవును' అంటూ తలలూప డం వల్ల పని ఒత్తిడి పెరిగి మానసిక ఆరోగ్యం దెబ్బతింటుం దంటున్నారని తెలిపింది.

# లవ్‌లో పడ్డ చిట్టి!

జాతిరత్నాలు సినిమాతో చిట్టీగా ఫేమస్ అయిపోయిన అమ్మడు ఫరియా అబ్దుల్లా. ఇటీవల గుర్రంపాపిరెడ్డి మూవీతో పాటు అనగనగా ఒక రాజులో ప్రత్యేక పాత్రలో మెరిసింది. కెరీర్ ప్రారంభం లో ఆమెను చూసిన వారందరూ కూడా ఉత్తరాది అమ్మాయి అనుకు న్నారు. కానీ, ఆమె అచ్చమైన హైదరాబాదీ. పుట్టింది, పెరిగిందీ ఇక్కడే. ఫరియా అబ్దుల్లా తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన ప్రేమ గురించి ఓపెన్‌గా మాట్లాడింది. ప్రస్తుతం తాను ప్రేమలో ఉన్నానని తెలిపింది. తన ప్రియుడు ముస్లిం కాదని, హిందూ అంటోంది. అలా అని తన బాల్య స్నేహితుడు కాదని క్లారిటీ ఇచ్చింది. సినిమా ఇండస్ట్రీకి చెందిన వ్యక్తేనని క్లూ ఇవ్వడంతో పాటు అతను ఒక కొరియోగ్రాఫర్‌గా పనిచే స్తున్నాడని చెప్పింది. తాము ఇద్దరం కలిసి వర్క్ చేస్తూ ఒక టీమ్‌లా ముందుకు వె ళ్తున్నట్లు మాట్లాడింది. కొంత కాలంగా తనలోని డ్యాన్స్, ర్యాప్‌లో వచ్చిన మార్పులకు అతనే కారణమని ఫరియా గుర్తుచేసుకుంది. తమ మధ్య ఉండే బంధం లవ్ అఫైర్ కాదని అదొక అనుబంధం అంటోందీ అమ్మడు. ఇంతకూ పెళ్లెప్పు డు చేసుకుంటుం దో మరి.

# అది నా అదృష్టం



మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శక త్వంలో వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు' థియే టర్లలో సందడి చేస్తూ కొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ సినిమాలో మరో హీరో వెంకటేశ్ కూడా అతిథి పాత్రలో కనిపించి నవ్వులు పంచాడు. అయితే ఈ మూవీ వి డుదలైన నాటి నుంచి వెంకీ భారీ మొత్తంలో రెమ్యూ నరేషన్‌తీసుకున్నాడని సోషల్‌మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. తాజాగా ఈ విషయంపై నిర్మాత సుస్మిత కొణిదెల స్పందించారు. ఆయన పారితోషికం విషయంలో ఎలాంటి చర్చ జరగలేదని, తీసుకున్న రెమ్యూనరేషన్‌కు పూర్తి న్యాయం చేశారని చెప్పారు. వ్యక్తిగతంగా వెంకీ చాలా పాజిటివ్ గా ఉంటారన్న సుష్మిత.. ఆయనకు ఎంత ఇవ్వాలన్నా తమకు ఆనంద మేనని తెలిపారు. భవిష్యత్తులో చిరు, వెంకీ మల్టీస్టారర్ వస్తే అందులో తాను భాగమైతే కచ్చితంగా అది తన అదృష్టంగా భావిస్తానని పేర్కొన్నారు.

## ఆసక్తికర కథాంశంతో 'కానిస్టేబుల్ కనకం: చాప్టర్ 3'.. ఈసారి థియేటర్స్‌లో..

సాధారణ క్రైమ్ థ్రిల్లర్‌గా ఈటీవీ విన్‌లో వచ్చి ప్రేక్షకులను విశేషంగా అలరించిన వెబ్‌సిరీస్ 'కానిస్టేబుల్ కనకం' . వర్ష బొల్లమ్మ, మేఘ లేఖ, రాజీవ్ కనకాల తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌కు ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించారు. దానికి కొనసాగింపుగా ఇటీవల విడుదలైన 'సీజన్2' తొలి భాగాన్ని మించి ట్విస్ట్‌లతో మెప్పించింది. ఇప్పుడు ఈ రెండింటికీ మించి థ్రిల్ పంచడానికి మరోసారి సిద్ధమవుతోంది. అయితే, ఈసారి ఓటీటీలో మాత్రం కాదండోయ్. 'కానిస్టేబుల్ కనకం: కాల్ ఘాట్ చాప్టర్3' పేరుతో మూవీగా థియేటర్స్‌లో విడుదల కానుంది. త్వరలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం స్పెషల్ గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఈ విశాలమైన ప్రకృతిలో అడుగడుగునా భగవంతుడి ఆనవాళ్లు ఉంటాయి. వెతికే వాళ్లు చాలా మంది. కానీ, చూసేవాళ్లు కొంతమంది.. ఆమె అడుగు పడిన నేల మామూలు నేల కాదు. గుండె చప్పుడుని సైతం బంధించే నరరూప రాక్షసులు సంచరించే చోటు.. 'కాల్ ఘాట్'' అంటూ విడుదలైన గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. వెబ్‌సిరీస్‌కు మించి భారీ హంగులతో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. పూరి జగన్నాథుడి నేపథ్యం కూడా సినిమాలో చేర్చారు. మరి ఈసారి కానిస్టేబుల్ కనకానికి ఎదురైన పరిస్థితులు ఏంటి? వాటిని ఆమె ఎలా పరిష్కరించారు? అన్నది సినిమాలో చూసి తెలుసుకోవాల్సిందే.



## 2026: ఉత్తమ చిత్రం కేటగిరిలో 10 చిత్రాలు.. ఆస్కార్ నామినేషన్స్ 2026 ఫుల్ లిస్ట్..



ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'ఆస్కార్స్ నామినేషన్స్ 2026' వెలువడ్డాయి. ఈ ఏడాది అవార్డుల కోసం పోటీ పడుతున్న చిత్రాల జాబితాను అకాడమీ ప్రకటించింది. 2025లో విడుదలై వివిధ విభాగాల్లో అద్భుత ప్రతిభను కనబరిచిన చిత్రాలు షార్ట్ లిస్ట్ అయి ఇప్పటికే అకాడమీ ముందుకు వచ్చాయి. వీటిలో విశేష ఆదరణ సొంతం చేసుకున్న చిత్రాలు, అందులోని నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేసి అవార్డుల కోసం పోటీపడుతున్న వారి జాబితాను అకాడమీ ప్రకటించింది. ఉత్తమ చిత్రం కేటగిరిలో అత్యధికంగా 10 చిత్రాలు పోటీ పడుతుండటం విశేషం. రేయాన్ కూగ్లర్ దర్శకత్వంలో రూపొందిన 'సిన్నర్స్' అత్యధికంగా 16 కేటగిరిల్లో నామినేషన్స్ దక్కించుకుంది. ఇప్పటివరకూ 14 నామినేషన్స్‌తో 'ఆల్ అబౌట్ ఈవ్', 'టైటానిక్', 'లా లా ల్యాండ్ ' పేరిట ఈ రికార్డు ఉండేది. 'సిన్నర్స్' దానిని బద్దలు కొట్టింది. ఈ మూవీ తర్వాత 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్'కు ఎక్కువ నామినేషన్స్ దక్కాయి. ఇక ఈ ఏడాది కొత్తగా క్యాస్టింగ్ డైరెక్టర్ కేటగిరిని అవార్డుల విభాగంలో చేర్చారు. 'సిన్నర్స్'లో నటనకు గానూ 73 ఏళ్ల డెల్రోయ్ లిండో తొలిసారి ఆస్కార్‌కు నామినేట్ అయ్యారు. ఈ నామినేషన్స్ ప్రకటన కార్యక్రమానికి నటుడు డానియల్ బ్రూక్స్, లూయిస్ పుల్‌మన్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. మార్చి 15వ తేదీన ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది.

## మొన్న 'ధురంధర్'.. ఇప్పుడు 'బోర్డర్ 2'.. ఆ దేశాల్లో నిషేధం!



సన్నీ దేవోల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బోర్డర్ 2' . జనవరి 23న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఆరు గల్ఫ్ దేశాల్లో 'బోర్డర్ 2' పై నిషేధం విధించినట్లు వార్తలు వస్తున్నాయి. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాతో పాటు యూఏఈ లోనూ 'బోర్డర్ 2'ను నిషేధించినట్లు తెలుస్తోంది. గల్ఫ్‌లోని అన్ని థియేటర్లలో దీన్ని విడుదల చేయడానికి నిర్మాతలు ప్రయత్నిస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తెరకెక్కించడం వల్లే ఆయా దేశాలు దీన్ని బ్యాన్ చేసినట్లు తెలుస్తోంది. గతేడాది చివర్లో విడుదలై సంచలనం సృష్టిస్తోన్న 'ధురంధర్'పై కూడా ఈ దేశాలు బ్యాన్ విధించిన విషయం తెలిసిందే. దీనిపై జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ చిత్రబృందం ప్రధాని మోదీకి కూడా లేఖ రాసింది. దీన్ని ఎక్కడైనా విడుదల చేసుకోవచ్చని ఎలాంటి అభ్యంతరకర సన్నివేశాలు లేవని సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిందని.. ఆ దేశాల్లో దీనిపై నిషేధం విధించడం భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమేనని ఆ లేఖలో మూవీటీమ్ పేర్కొంది. 'బోర్డర్ 2' విషయానికొస్తే.. భారత్ పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంతో తెరకెక్కిన హిట్ మూవీ 'బోర్డర్'. 28 ఏళ్ల తర్వాత దానికి సీక్వెల్‌గా రూపొందింది 'బోర్డర్ 2'. సన్నీ దేవోల్ ప్రధాన పాత్రలో తొలి పార్ట్‌ను జె.పి.దత్తా తెరకెక్కించగా.. రెండో భాగాన్ని అనురాగ్ సింగ్ రూపొందించారు. సీక్వెల్‌లో వరుణ్ ధావన్, దిల్జీత్ దొసాంజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## మేం వివాహం చేసుకున్నట్లే.. కానీ: ఆమిర్‌ఖాన్



తన ప్రియురాలు గౌరీ స్ప్రాట్ తనతోనే కలిసే ఉంటున్నట్లు బాలీవుడ్ అగ్ర నటుడు ఆమిర్‌ఖాన్ తెలిపారు. గత కొన్ని నెలలుగా ఇండస్ట్రీలో జరిగే ఈవెంట్‌లకు వీరిద్దరూ కలిసి హాజరవుతూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన పెళ్లి గురించి ప్రస్తావించారు. ''గౌరి, నేను ఒకరిపై ఒకరు గౌరవంతో ఉన్నాం. అర్థం చేసుకుంటూ ముందుకుసాగుతున్నాం. మా దృష్టిలో వివాహం అంటే రెండు మనసుల కలయిక. ఈ రకంగా చూస్తే మేం వివాహం చేసుకున్నట్లే. ప్రస్తుతం మేం కలిసే ఉంటున్నాం. ఈ వివాహాన్ని మేం అధికారికం చేయాలా, వద్దా అనేది భవిష్యత్తులో నిర్ణయించుకుంటాం'' అని తెలిపారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.